ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 11 నవంబరు 2024



కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మోక్షం!

- రెండేళ్ల కిందట నోటిఫికేషన్ విడుదల
- గత ఏడాది ఫిబ్రవరిలో ప్రిలిమ్స్
- మార్చిలో శారీరక, దేహదారుఢ్య పరీక్షలకు షెడ్యూల్
- ఎమ్మెల్సీ ఎన్నికల నెపంతో తప్పించుకున్న వైసీపీ సర్కారు
- తదుపరి ప్రక్రియకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం

- 8వ పేజీలో

గాడి తప్పిన క్లాప్!

ఇళ్ల నుంచి మొక్కుబడిగా చెత్త సేకరణ

- వారంలో నాలుగైదు రోజులే విధులు
- రోజులో మూడు ట్రిప్పులు తిరగాల్సి ఉండగా ఒకటి, రెండుతో సరి
- కనీసం 700 కిలోల చెత్త నిబంధన బేఖాతరు
- 250 కేజీల చెత్తతో యార్డుకి వెళ్లి వస్తున్న వైనం
- వాహనం రాకపోవడంతో రోడ్లపై చెత్తవేస్తున్న జనం
- రహదారులపై పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- అయినా కాంట్రాక్టర్‌కు ఆగని చెల్లింపులు..
- నగర వాసులకు తప్పని తిప్పలు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహనాల పనితీరు పూర్తిగా గాడితప్పింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్‌తోపాటు వాహనాల సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఇంటి నుంచి రోజువారి తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి ఎంఎస్‌ఎఫ్‌లకు తరలించాల్సిన వాహనాలు వారంలో నాలుగైదు రోజులు మించి తిరగడం లేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా రోజూ ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను మూడు ట్రిపుల్లో యార్డుకు తరించాల్సి ఉండగా ఒకటి, రెండు ట్రిప్పులతోనే సరిపెడుతున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోని చెత్తను తీసుకువచ్చి రోడ్లపై పడేస్తున్నారు. దీంతో నగరం కంపుకొడుతోంది.

రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)కు శ్రీకారం చుట్టింది. రోజువారీగా ప్రతి ఇంటికీ వెళ్లి తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సమీపంలోని చెత్త ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ (ఎంఎస్‌ఎఫ్)లకు తరలించేందుకు వీలుగా గత వైసీపీ ప్రభుత్వం వాహనాలను ఏర్పాటు చేసింది. వార్డు సచివాలయం పరిధిలోని ఇళ్ల సంఖ్యను బట్టి ఒక్కో వాహనం రోజుకి రెండు, మూడు ట్రిప్పులు తిరగాలి. దీంతో వీధుల్లో చెత్త సమస్య ఉండదనేది ఆలోచన. వాహనాలకు నెలకు రూ.64వేలు చొప్పున అద్దె చెల్లించేలా రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఏజెన్సీతో గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు జీవీఎంసీ పరిధిలో 582 వార్డుసచివాలయాలకు అదే సంఖ్యలో వాహనాలను కేటాయించారు. ఒక్కో వాహనానికి రూ.64వేలు చొప్పున నెలకు రూ.3.72 కోట్లు సదరు కాంట్రాక్టర్‌కు జీవీఎంసీ చెల్లిస్తోంది. వాహనం పర్యవేక్షణ బాధ్యతలను వార్డు సచివాలయంలోని శానిటేషన్ కార్యదర్శికి అప్పగించారు.

కనిపించని పర్యవేక్షణ

ఇదిలా ఉండగా జీవీఎంసీపరిధిలో క్లాప్ వాహనాలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి పర్యవేక్షణపై అధికారుల్లో సమన్వయం కరువైంది. ఈ బాధ్యత అదనపు భారంగా మారిందని శానిటేషన్ కార్యదర్శులు పట్టించుకోవడం మానేశారు. ఇతర అధికారులు కూడా సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో వాహనాలను సమకూర్చిన కాంట్రాక్టర్, డ్రైవర్లను ప్రశ్నించే వారు లేక పనితీరు ఇష్టారాజ్యంగా మారింది. ఆదివారం మినహా ప్రతిరోజూ చెత్త సేకరించాల్సి ఉన్నప్పటికీ కొన్ని సచివాలయాల పరిధిలో వారంలో నాలుగు, ఐదు రోజులు మాత్రమే వాహనాలు వెళ్లివస్తున్నాయి. అదీ రోజుకో ప్రాంతానికి మాత్రమే పరిమితమవుతున్నాయి. చాలావాహనాలు ఒక ట్రిప్పు తర్వాత ఆపేస్తుండగా, మరికొన్ని రెండు ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతి వాహనం ఒకట్రిప్పులో కనీసం 700 కిలోల చెత్తను తరలించాలన్నది నిబంధన. ఇందుకోసం ఎంఎస్‌ఎఫ్‌లోనూ వేయింగ్‌బ్రిడ్జిని ఏర్పాటుచేశారు. కాగా అక్కడి రికార్డులను పరిశీలిస్తే ఒక్కోవాహనం ఒకటి, రెండు ట్రిప్పులతోనే సరిపెడుతున్నాయని, చెత్తబరువు సరాసరి 250 నుంచి 300 కిలోల మధ్య ఉందని తేలింది.

జీవీఎంసీ పరిధిలో క్లాప్ వాహనాలు సుమారు:	582
చెత్తసేకరణకు ప్రతి వార్డుకి	ఒక వాహనం
ప్రతిరోజూ ఒక్కో వాహనం యార్డుకు తిరగాల్సిన ట్రిప్పులు:	3
ప్రతినెలా ఒక్కో వాహనానికి జీవీఎంసీ చెల్లించే మొత్తం:	రూ.64వేలు
నెలలో కాంట్రాక్టర్‌కు చెల్లించే మొత్తం:	రూ.3.72 కోట్లు
ఒక ట్రిప్పులో తీసుకెళ్లాల్సిన చెత్త :	కనీసం 700 కిలోలు

కాంట్రాక్టర్‌కు ఆగని చెల్లింపులు

చెత్త సేకరణ సక్రమంగా సాగకపోవడంతో ఇళ్లలో చెత్త నిల్వ ఉండిపోతోంది. దీనివల్ల దోమల వ్యాప్తి, దుర్గంధం కారణంగా ప్రజలు చెత్తను రోడ్డుపై పడేస్తున్నారు. దీంతో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. వీటిని పారిశుధ్య సిబ్బంది తరలించేందుకు అవకాశం లేపోవడంతో రోజుల తరబడి నిల్వ ఉండిపోయి ఆయా ప్రాంతాలు కంపుకొడుతున్నాయి. కాగా ఒప్పందం ప్రకారం చెత్త సేకరణ చేస్తున్నారంటూ కాంట్రాక్టరు బిల్లు పంపడమే ఆలస్యంగా జీవీఎంసీ అధికారులు చెల్లింపులు జరిపేస్తున్నారు. రూ.కోట్ల ప్రజాధనం ఖర్చవుతున్నా

... మిగతా 6వ పేజీలో

మధ్యాహ్న భోజనానికి సరికొత్త మెనూ!

వారంలో నాలుగు రోజులు అన్నం, ఆకుకూర పప్పు, కూర, సాంబారు, రసం

- ఒక రోజు వెజ్ పలావ్, పులిహోర
- రూపొందించిన పాఠశాల విద్యాశాఖ
- త్వరలో పాఠశాలల్లో అమలుకు కసరత్తు
- రసం బదులు పప్పు మేలని నిపుణుల సూచన







విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్నం అందించే భోజనంలో మార్పులు జరగనున్నాయి. రాష్ట్రంలోని ప్రాంతాల వారీగా ప్రజల అలవాట్లను పరిగణనలో తీసుకున్న ప్రభుత్వం మెనూను రూపొందించింది. ఈ మేరకు ఉత్తరాంధ్ర ప్రజల అలవాట్ల మేరకు వారానికి నాలుగు రోజులు వైట్ రైస్‌తో కూడిన భోజనం అందిస్తారు. సోమవారం వైట్‌రైస్, తోటకూరపప్పు, ఉడకబెట్టిన గుడ్డు, శనగపప్పు చిక్కీ, మంగళవారం వైట్ రైస్, గుడ్డు కూర, రసం, రాగి జావ, బుధవారం వెజ్ పలావ్, బంగాళదుంపల కుర్మా, ఉడకబెట్టిన గుడ్డు, శనగపప్పు చిక్కీ, గురువారం వైట్‌రైస్, సాంబారు, గుడ్డుకూర, రాగి జావ, శుక్రవారం చింతపండుతో పులిహోర, వెజిటబుల్స్/గోంగూర చట్నీ, ఉడకబెట్టిన గుడ్డు, శనగపప్పు చిక్కీ, శనివారం వైట్ రైస్, వెజిటబుల్ కర్రీ, రసం, రాగి జావ, స్వీట్ పొంగల్ ఇవ్వాలని ప్రతిపాదించారు.

గత ప్రభుత్వంలో విద్యార్థులకు ఇష్టం లేకపోయినా కిచిడీ, బిర్యానీ, పొంగల్ వంటి వాటితో అందించే భోజనం తినేందుకు ఎక్కువమంది ఇష్టపడేవారు కాదు. అలవాటులేని భోజనంపై అయిష్టత చూపిన విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారియర్ తెచ్చుకునేవారు. దీనిపై అభ్యంతరాలు వచ్చినా పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులను గుర్తించింది. దీనిపై మానవ వనరుల అభివృద్ధిశాఖామంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకుని మెనూ మార్చాలని నిర్ణయించారు. ఇందులోభాగంగా ప్రాంతాలవారీగా ప్రజల భోజన అలవాట్లను తెలుసుకున్నారు. విద్యార్థులు ఇష్టపడి తినేలా

... మిగతా 6వ పేజీలో

హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

ఏడుగురికి అస్వస్థత, ఆస్పత్రికి తరలింపు

- ఐసీయూలో ముగ్గురికి చికిత్స
- శ్రీవిశ్వ జూనియర్ కళాశాలలో సంఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న ఆర్‌ఐవో మురళీధర్

మహారాణిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని లాసన్స్‌బే కాలనీలో గల శ్రీవిశ్వ జూనియర్ కళాశాల బాలికల హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్‌తో పలువురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి రాంనగర్‌లోని ఓమ్ని ఆర్కే ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. శ్రీవిశ్వజూనియర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆదివారం మధ్యాహ్నం సిరిపురం సమీపంలోని గురజాడ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్‌బిర్యానీ, భోజనం అందించారు. అక్కడ మిగిలిన భోజనాన్ని సాయంత్రం హాస్టల్‌కు తరలించారు. రాత్రి భోజనాల సమయంలో దానిని వడ్డించారు. హాస్టల్‌లో 220 మంది వరకు విద్యార్థినులున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. రాత్రి భోజనం చేసిన వారిలో కొందరు ఒక్కసారిగా వాంతులు చేసుకోగా, మరికొందరు

... మిగతా 6వ పేజీలో

తీరానికి పోటెత్తిన జనం



సెలవు దినం కావడం, అందునా కార్తీకమాసం పిక్నిక్‌లు ప్రారంభం కావడంతో తీరానికి జనం పోటెత్తారు. నగర వాసులతో పాటు, ఉత్తరాంధ్ర పరిధిలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారు చేరుకోవడంతో ఆదివారం సాయంత్రం ఆర్‌కేబీచ్ నుంచి భీమిలి వరకు అన్ని ప్రాంతాలు కిటకిటలాడాయి. సముద్రంలో స్నానాలు చేసి సందడిగా గడిపారు. మరోవైపు ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలకు భారీగా సందర్శకులు తరలి వచ్చారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

గంజాయి మొక్కలపై ముమ్మర దర్యాప్తు

- పరారైన నిందితుల కోసం పోలీసుల గాలింపు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):

కేజీహెచ్ ఆవరణలో మహిళా వైద్య విద్యార్థుల హాస్టల్ వెనుకవైపు గంజాయి మొక్కలు లభ్యమైన కేసులో వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. రెండు గంజాయి మొక్కలను ఏవీఎన్ కాలేజీ సమీపంలోని కోడిపందాలవీధికి చెందిన ఐదుగురు యువకులు పెంచుతున్నట్టు పోలీసులు దర్యాప్తులో నిర్ధారించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. గంజాయి మొక్కల పెంపకంలో ప్రమేయం కలిగివున్న ఒక జువైనల్‌తో పాటు మరో ఇద్దరు యువకులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు. ఇదిలావుండగా గంజాయి మొక్కలను నగరంలో ఇంకా ఎక్కడైనా పెంచే అవకాశం ఉందా? అనే దానిపై శివారుప్రాంతాలు, నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అన్ని స్టేషన్ల సీఐలను ఉన్నతాధికారులు ఆదేశించారు. అలాగే గంజాయి వినియోగంపైనా పటిష్ఠ నిఘా ఉంచాలని ఆదేశించడంతో నగరంలోని నిర్మానుష్యప్రాంతాలపై పోలీసులు దృష్టి సారించారు.

ఏయూలో ఇష్టారాజ్యం

- అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని కీలక సెక్షన్ సూపరింటెండెంట్ హవా
- గత వీసీ ప్రసాదరెడ్డికి సన్నిహితుడిగా పేరు
- ప్రస్తుత ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు
- సెలవు పెట్టిన ఉద్యోగికి అబ్‌స్కాండ్ పేరుతో వేధింపులు
- 15 నెలలు గాలిలో ఉంచి, రూ.లక్ష జరిమానా విధింపు
- మరో ఉద్యోగి సెలవు చీటీ ఇవ్వకున్నా లీవ్‌గా గుర్తింపు
- బదిలీల్లో పూర్తి గోప్యత... వ్యక్తిగతంగా ఆర్డర్లు అందజేత



విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన విభాగంలో ఒక కీలక సెక్షన్ సూపరింటెండెంట్ వ్యవహారశైలి వివాదాస్పదంగా మారుతోంది. గత వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డికి అత్యంత సన్నిహితమైన వ్యక్తిగా పేరున్న ఇతడు ఇద్దరు ఉద్యోగుల విషయంలో వ్యవహరించిన తీరు వివాదాస్పదమయింది.

ఏయూ థియేటర్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్ పైడి శ్రీనివాస్ తన తల్లికి అనారోగ్యంగా ఉందని 2022 జనవరి నుంచి 2023 మే వరకు సెలవుపెట్టారు. ఆ తరువాత విధుల్లో

... మిగతా 6వ పేజీలో

దోమల నియంత్రణకు డ్రోన్లు

జీవీఎంసీ పరిధిలో ఫలితమిస్తున్న ప్రయోగం

- చెరువుల్లో మలాథియన్‌స్ప్రేకు వినియోగం
- 69 చెరువుల్లో ఇప్పటికే ప్రక్రియ పూర్తి
- తర్వాత కూడా కొనసాగించే యోచన

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో దోమల నియంత్రణకు డ్రోన్ల వినియోగానికి జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. చెరువులు, కుంటల్లో మలాథియన్ స్ప్రే చేయడం ద్వారా దోమల లార్వాలను ధ్వంసం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రయోగాత్మకంగా డ్రోన్లతో ఒకదశ స్ప్రేయింగ్ చేయించింది. ఫలితాలను చూసిన తర్వాత దీనిని కొనసాగించాలని అధికారులు యోచిస్తున్నారు.



పెందుర్తిలోని చెరువులో డ్రోన్‌తో మలాథియన్ స్ప్రేకు చర్యలు (ఫైల్ ఫొటో)

నగరంలో ఏటా డెంగ్యూ, మలేరియా కేసులు భారీగా నమోదవుతున్నాయి. ప్రధానంగా వర్షాకాలంలో వీటి తీవ్రత మరింత ఎక్కువగా ఉంటోంది. నగరంలో నీరు నిల్వఉండిపోవడం వల్ల దోమలకు ఆవాసంగా మారుతోందని గుర్తించిన జీవీఎంసీ అధికారులు సమస్య పరిష్కారానికి చెరువులు, కుంటలు, డ్రైనేజీలతోపాటు నీరు నిల్వఉండే ప్రాంతాల్లో మలాథియాన్ రసాయనాన్ని పిచికారీ చేయిస్తున్నారు. అయితే చెరువుల ఒడ్డున మాత్రమే స్ప్రే చేయడానికి అవకాశం ఉండడంతో మధ్యలో ఉండే దోమలు, లార్వాలపై ఎలాంటి ప్రభావం కనిపించడం లేదు. మనుషులతో స్ప్రేయింగ్ చేయించడం కాకుండా ఇటీవల అమరావతిలో జరిగిన డ్రోన్‌షో స్ఫూర్తిగా తీసుకున్న అధికారులు చెరువుల్లో దోమల నియంత్రణకు మలాథియాన్ స్ప్రే చేసేందుకు డ్రోన్‌లను ఉపయోగించుకుంటే ఎలా ఉంటుందనేదానిపై దృష్టి సారించారు. రాజమండ్రిలో కూడా డ్రోన్‌తో మలాథియాన్ స్ప్రేయింగ్ చేసినట్టు తెలియడంతో, అదే ఏజెన్సీతో నగరంలోని చెరువుల్లో స్ప్రేయింగ్ చేయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

చెరువులపై దృష్టి

జీవీఎంసీ పరిధిలో 69 చెరువులు, కుంటలు ఉన్నట్టు గుర్తించిన అధికారులు వాటిల్లో ఒకసారి మలాథియాన్ స్ప్రే చేసేందుకు రూ.2.63 లక్షలు చెల్లించేందుకు అంగీకరించారు. ఒప్పందం కుదుర్చుకున్న ఏజెన్సీ ఇటీవల నగరంలోని 69చెరువులు, కుంటల్లో డ్రోన్‌తో మలాథియాన్ స్ప్రేయింగ్ పూర్తిచేసింది. దీనివల్ల చెరువులోని నీటిపై మలాథియన్‌రసాయనం ఫిల్మ్ మాదిరిగా ఏర్పడినట్టు అధికారులు గుర్తించారు. దీనివల్ల నీటిలో ఉన్న

... మిగతా 6వ పేజీలో



స్వామివారికి పూజ చేస్తున్న అర్చకుడు

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాదనలు పూర్తిచేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలు తీసి భక్తులతో స్పశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి పసిడి కుసుమాలతో పూజ జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అలాగే ఆర్జిత సేవల్లో భాగంగా సహస్రనామ తులసీ దళార్చన, గరుడ సేవ, నిత్య కల్యాణాలు కూడా వైభవంగా నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి విజయనగరం ప్రాంతానికి చెందిన అనిల్ కుమార్ జైన్ రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,11,116లను నగదు రూపంలో ఆయన పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు (విక్రమ్)కు ఆదివారం అందజేశారు. అలయ ఆచారం ప్రకారం అధికారులు దాతకు అంతరాలయ దర్శనం కల్పించి, శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

సింహగిరిపై విదేశీయులు



మాడవీధిలో ఇటలీ దేశస్తులు

సింహాచలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని పలువురు విదేశీయులు ఆదివారం దర్శించుకున్నారు. ఇటలీకి చెందిన పర్యాటకుల బృందం సాధారణ భక్తుల్లానే రూ.100 శ్రీఘ్రదర్శనం టికెట్ల తీసుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని శిల్ప సంపదను సమగ్రంగా పరిశీలించారు. సింహగిరిపై ప్రకృతి రమణీయ దృశ్యాలను చూసి, పరవశించారు.

ఓటరు నమోదుకు స్పందన

పద్మనాభం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శని, ఆదివారం నిర్వహించిన ఓటరు నమోదు శిబిరాలకు విశేష స్పందన లభించిందని తహసీల్దార్ కె. ఆనందరావు తెలిపారు. ఆదివారం ఆయన పలు పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఓటరు నమోదును పరిశీలించారు. బీఎల్ఓల వద్ద రికార్డులను తనిఖీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన ఓటర్ల నమోదు శిబిరాల్లో ఫారం 6కు 13 దరఖాస్తులు. ఫారం 5కు 7 దరఖాస్తులు,ఫారం 8కు 6 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆయనతో పాటు డీటీ చంద్రశేఖర్, ఎంఆర్ఐ శ్యామల, వీఆర్ఓలు, బీఎల్ఓలు ఉన్నారు.

జోరుగా రగ్గుల విక్రయాలు



మధురవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చలికాలం నేస్తాలు వచ్చేశాయి. ఏటా అక్టోబరు నుంచి జనవరి వరకు మధురవాడ పరిసరాల్లో హైవేకు ఆనుకొని ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు జాతీయ రహదారికి ఇరువైపులా తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి రగ్గులు విక్రయిస్తారు. వీటిలో రగ్గులు, స్వెట్టర్లు, మఫ్లర్లు కూడా ఉన్నాయి. చలి మొదలు కావడంతో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు నాలుగు నెలల పాటు ఈ వ్యాపారం కొనసాగిస్తారు.

గాడితప్పిన క్లాప్!

... 5వ పేజీ తరువాయి

లక్ష్యం నెరవేరడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూజర్ చార్జీలను రద్దుచేసింది. దీంతో జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి బిల్లులు చెల్లిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు చెత్త సేకరణపై కాంట్రాక్టర్‌ను నిలదీయడం లేదు. జీవీఎంసీలోని కొంతమంది పాలవకవర్గ పెద్దలు కాంట్రాక్టర్‌కు మేలుచేసేలా సహకరిస్తుండడంతో అధికారులు బిల్లులు చెల్లించేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా క్లాప్‌కాంట్రాక్టర్‌కు బిల్లు పెండింగ్‌లో ఉందని, తక్షణం చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, వాహనాలను సక్రమంగా నడపాలని మాత్రం సూచించడం లేదని ప్రజారోగ్య విభాగం సిబ్బంది విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కమిషనర్ పి.సంపత్‌కుమార్ దృష్టిసారించి క్లాప్‌వాహనాల పనితీరును గాడిన పెట్టేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా దొరతోట జంక్షన్

- నెలలో కనీసం మూడు సంఘటనలు
- కానరాని వాహనాల వేగ నియంత్రణ చర్యలు
- భయాందోళనలో వాహనదారులు



వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే కూడలి

భీమునిపట్నం(రూరల్), నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం నుంచి ఆనందపురం మీదుగా వెళ్లే జాతీయ రహదారి నుంచి భీమిలికి వెళ్లడానికి ఉన్న క్రాస్ రోడ్డు ప్రమాదాల నిలయంగా తయారైంది. ప్రధానమైన నాలుగు ప్రాంతాల రహదారులు ఇక్కడ కలవడం వల్ల నిత్యం రద్దీగా ఉంటోంది. వాహనదారులు వేగంగా వస్తుండడంతో కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి నెల ఒకటి రెండు ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయి. కూడలిలో ప్రమాదాల నివారణ కోసం పోలీసులు గస్తీ కోసం ఔటు పోస్టు స్టేషన్ కూడా ఏర్పాటు చేసి, కొంతకాలం నిర్వహించారు. ప్రస్తుతం దీన్ని ఎత్తివేశారు. దీంతో ఔటు పోస్టు భవనం నిరుపయోగంగా మారింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కూడలిలో సీసీ కెమెరాలను మాత్రం ఏర్పాటు చేశారు. విశాఖ నుంచి జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలు భీమిలికి వెళ్లడానికి మలుపు తిరిగే సమయంలో వాహనాలను అదుపు చేయడానికి సిగ్నల్ వ్యవస్థ లేకపోవడం వల్ల విజయనగరం నుంచి వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి.గతంలో ఆవులను తీసుకువెళుతున్న వ్యాన్‌ను లారీ ఢీకొనడంతో 30 ఆవులు చనిపోయి, రహదారి రక్తసిక్తం అయ్యింది. ఇటువంటి ప్రమాదాలు ఇక్కడ తరచూ జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు స్టాపర్లు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం ఉండడం లేదు. కూడలిలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి పోలీసుల నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు



పర్యాటకులతో కళకళలాడుతున్న భీమిలి తీరం



కైలాసగిరిపై పర్యాటకుల సందడి

పర్యాటక ప్రాంతాలు కిటకిట

భీమునిపట్నం/సాగర్‌నగర్/విశాలాక్షినగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, రుషికొండ, సాగర్‌నగర్, తదితర పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. కైలాసగిరి, తెన్నేటీపార్కు, జోడుగుళ్లపాలెం తీరంలో ఉన్న నౌకా ప్రాంతాల్లోనూ పర్యాటకులు సందడి చేశారు. ఉదయం కైలాసగిరికి చేరుకున్న పర్యాటకులు భోజనాలు ముగించుకుని మధ్యాహ్నానికి తెన్నేటీ పార్కు, బీచ్‌కు చేరుకుని సంతోషంగా గడిపారు. అలాగే రుషికొండ బీచ్ కూడా సందర్శకులతో రద్దీగా కనిపించింది.కొందరు సముద్ర స్నానాలు చేస్తూ.. మరికొందరు బోటుషికారు చేస్తు ఉత్సాహంగా గడిపారు. భీమిలి తీరంలోనూ సందడి వాతావరణం నెలకొంది. బీచ్ రోడ్‌లోని కొబ్బరిచెట్ల పార్క్, తొట్లకొండ, రామాద్రి బీచ్, ఎర్రమట్టిదిబ్బలు పిక్నిక్‌ల సందడితో నిండాయి. అలాగే బీచ్‌రోడ్‌లో వున్న జీడిమామిడి తోటల్లో సందర్శకులు వన సమారాధనలు చేసుకున్నారు. భీమిలి సాగర తీరం కూడా సందర్శకులతో కిటకిటలాడింది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చాలామంది తెల్లవారు జామున బీచ్‌కు వచ్చి తర్వాత, బీచ్‌రోడ్ మీదుగా నగరానికి ప్రయాణమయ్యారు. తిరిగి సాయంత్రం సాగర తీరానికి చేరుకుని కాసేపు సముద్ర కెరటాల్లో ఆటలు ఆడి ఆనందించారు. విదేశీ పర్యాటకులు కూడా భీమిలి బీచ్‌ను సందర్శించారు.

సందీప్, ప్రణవ్‌లకు అభినందనలు

ఆనందపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడిగా నియమితులైన జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్‌కు, వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా నియమితులైన ప్రణవ్‌గోపాల్‌కు మండల టీడీపీ, జనసేన నాయకులు అభినందనలు తెలిపారు. ఆదివారం వారు నగరంలో సందీప్‌ను, ప్రణవ్‌గోపాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ యువ నాయకుడు, వేములవలస ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విజయానికి కృషి చేసిన నాయకుల కష్టాన్ని గుర్తించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించడం అనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గంట్రెడ్డి రమేశ్, బలిరెడ్డి మల్లికార్జునరావు, బీఆర్‌బీ నాయుడు, తాట్రాజు అప్పారావు, కోరాడ వైకుంఠరావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆనందపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గిడిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2014-15 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో గంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఎంత ఉన్నతి స్థితికివెళ్లినా ఉపాధ్యాయులకు పిల్లలే అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇమంది పైడిరాజు, అప్పలనాయుడు, గొర్లి కృష్ణ, పాల్గొన్నారు.

వేములవలసలో ఘనంగా దీపోత్సవం



దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న బ్రహ్మ కుమారీలు

ఆనందపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలస పూల మార్కెట్ సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆదివారం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మ కుమారీలు మాట్లాడుతూ ఈనెల 11,12,13 తేదీల్లో కార్తీక దీపోత్సవం, ద్వాదశ జ్యోతిర్లింగ దివ్య దర్శనం భక్తులకు కల్పించనున్నట్టు తెలిపారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు జ్యోతిర్లింగ దివ్య దర్శనం చేసుకోవచ్చనని చెప్పారు. 12న రుద్ర జ్ఞాన యజ్ఞం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనా లని వారు కోరారు.

కార్తీక మాసం విశిష్టతపై ప్రచారం

పద్మనాభం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయినాడ, సత్యనారాయణపురం గ్రామాల్లో ఇందూ జ్ఞాన వేదిక ప్రబోద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాసం విశిష్టత, కార్తీక పౌర్ణమి రోజు వెలిగించే దీపం ప్రాముఖ్యత, త్రైత సిద్ధాంత భగవద్గీత సంస్థ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలోని సాహిత్యాన్ని ప్రతిఒక్కరికి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు త్రినాథరావు, సభ్యులు కృష్ణ, సూరప్పడు, సురేశ్, పైడన్న, సంతోషలక్ష్మి, ఆదమ్మ, అచ్చియ్యమ్మ పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని ధర్నా

గాజువాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు ఉద్యోగు లకు జీతాలు చెల్లించే విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఆదివారం సీఐటీయూ ప్లాంట్ నాయకుల ఆధ్వర్యంలో పాత గాజువాక జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు విచ్చే విషయంలో యాజమాన్యం చాలా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఓ పక్క ఉత్పత్తి పెంచుతామని చెబుతున్న యాజమాన్యం, మరో పక్క కార్మికుల సంఖ్య తగ్గించటం, కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ఆత్మస్థైర్యం దెబ్బతీస్తుందన్నారు. గత కొన్ని నెలలుగా జీతాలు లేక ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.



చంద్రంపాలెంలో సభ్యత్వాలు నమోదు చేస్తున్న నాయకులు

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

కొమ్మాది, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వాల నమోదులో భీమిలి నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేస్తున్నామని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మొల్లి లక్ష్మణరావు అన్నారు. ఆదివారం ఆయన 5వ వార్డు పరిధిలోని స్వతంత్రనగర్, రాజీవ్ గృహకల్ప, శారదానగర్, స్వయంకృషినగర్ ప్రాంతాల్లో సభ్యత్వాల నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు పట్ల యువత ఎక్కువ ఉత్సాహం చూపిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, బూత్ ఇన్‌చార్జి వాండ్రాసి అప్పలరాజు, వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆరో వార్డు పరిధిలోని పోతినమల్లయ్యపాలెం రెండవ బస్టాపు వద్ద విశాఖ పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు గొరే గురునాథ్ ఆధ్వర్యంలో కూడా సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మారుపల్లి రాజేంద్ర, బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, , కుప్పక రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

8వ వార్డు గొల్లల ఎండాడలో...

ఎండాడ : జీవీఎంసీ 8వ వార్డులో టీడీపీ సభ్యత్వాల నమోదు జోరుగా సాగుతోంది. ఆదివారం ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో గొల్లల ఎండాడలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అప్పారావు, సారిపిల్లి శ్రీను, ఒమ్మి బాబూరావు, పరమేశ్, రాజు, ఆర్టీవో శ్రీను, సారిపిల్లి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏడో వార్డు చంద్రంపాలెంలో...

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని చంద్రంపాలెంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రికార్డు స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు కార్యదర్శి కానూరి అచ్చుతరావు, తెలుగు యువత అధ్యక్షుడు మామిడి దుర్గారావు, పోతిన బుజ్జి, పిళ్లా రాము, రాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు గొల్లల ఎండాడ బాలుడి ఎంపిక

ఎండాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని గొల్లల ఎండాడ గ్రామానికి చెందిన ఒమ్మి తరుణ్ యాదవ్ కర్ణాటకలోని మైసూర్‌లో జరిగే జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కాకినాడలో ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఐదు నుంచి ఏడేళ్ల విభాగంలో తరుణ్ రెండు సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకున్నాడు. ఈమేరకు బాలుడ్ని నిర్వాహకులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. తరుణ్ గతంలోనూ పలు పోటీల్లో పాల్గొని బంగారు, రజత పతకాలు గెలుపొందాడు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆనందపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఇందిరాగాంధీ ఎన్ఎస్ఎస్ నేషనల్ అవార్డు గ్రహీత ఆర్. లీలాప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కేజీబీవీలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కువ శాతం వాహనాల కాలుష్యం వల్ల వాతావరణం కలుషితమవుతుందని, దాన్ని అధిగమించాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని చెప్పారు.

ఏయూలో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

చేరేందుకు ఉన్నతాధికారులకు లేఖరా శారు. సాధారణంగా దీనిని పరిశీలించి విధుల్లోకి తీసుకో వాలి. కానీ ఎస్3 సెక్షన్ ఉన్నతాధికారులు అతడిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. సెలవు పెట్టినప్పటికీ అబ్ స్కాండ్ (అదృశ్యం) అంటూ ఉన్నతాధికారులు చూపించి రూ. లక్ష జరిమానా విధించారు. ప్రస్తుతం ఆ ఉద్యోగి వేతనంలో ప్రతినెల రూ.8,500 చొప్పున కోత విధిస్తున్నారు.

నిబంధనలు తోసిరాజని

నిబంధనల మేరకు ఉద్యోగి అబ్‌స్కాండ్ అయితే మెమో ఇవ్వాలి. శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. కానీ ఉద్యోగి అధికారికంగా లీవ్‌లో ఉన్నా అబ్‌స్కాండ్ పదాన్ని వాడి జరిమానా విధించారు. ఇదే సెక్షన్‌లో టైపిస్ట్ సెలవు పెట్ట కుండా, ఉన్నతాధికారులకు కనీసం సమాచారం ఇవ్వకుండా గత ఏడాది మే నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు విధులకు హాజరుకాలేదు. సాధారణంగా దీనిని అబ్‌స్కాండ్‌గా పేర్కొం టారు. కానీ ఆ ఉన్నతాధికారికి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే సదరు ఉద్యోగి బంధువు కావడంతో లాస్ ఆఫ్‌పే కింద పరిగణలోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఉద్యో గులకు అధికారులు ఆర్డర్ కాపీలో పేర్కొన్న నిబంధనలు ఒకటే కావడం గమనార్హం. అయితే, లీవ్ పెట్టిన ఉద్యోగికి జరిమానా విధించగా, మరో ఉద్యోగికి సెలవుగా పరిగణిం చడం విశేషం. గత ఏడాది మేలో విధుల్లో చేరేందుకు పైడి శ్రీనివాస్ ఉన్నతాధికారులకు లేఖ రాసిననప్పటికీ ఈ ఏడాది ఆగస్టు వరకు వేధింపులకు గురిచేశారు. అంటే సుమారు 15 నెలలపాటు వర్సిటీకి దూరం పెట్టారు. ఓ ఉన్నతాధికారి ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకు విధులకు హాజరవుతుండడంతో శ్రీనివాస్ ప్రశ్నించడమే దీనికి కారణం గా తెలుస్తోంది. సెక్షన్ ఉన్నతాధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తనకు అనుకూలమైన వారికి మేళ్లు చేస్తుంటారని సమాచారం.

బదిలీల్లోనూ గోప్యత

సాధారణంగా సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కేడర్లకు సంబంధించిన ఉద్యోగులకు బదిలీలు చేస్తే మొత్తం జాబితాను విడుదల చేస్తారు. కానీ తాజాగా బదిలీలను గు ట్టుగా సాగిస్తున్నారు. ఉత్తర్వులను వ్యక్తిగతంగా అందిస్తు న్నారు. ఇటీవల ఇలానే ప్రక్రియ చేపట్టిన అధికారులు తాజా గా మరికొందరు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. ఇదే పరిపాలనా విభాగంలోని మరో కీలక సెక్షన్ సూపరింటెండెంట్ కూడా తనకు నచ్చినట్టుగా పనిచేస్తారనే ఆరోపణలున్నాయి. ఇతడు గత వీసీ ప్రసాద రెడ్డికి నమ్మిన బంటుగా పనిచేసేవారని పేరుంది. ఇప్పటికీ వర్సిటీ ఉన్నతాధికారుల మాటను లెక్క చేయరన్న ప్రచార మూ ఉంది. వర్సిటీ గ్రౌండ్స్‌లో దీపావళి దుకాణాలకు అను మతుల విషయంలోనూ ఆయన భారీగానే లబ్ధి పొందినట్టు ఉద్యోగులే చెబుతున్నారు.



స్వామివారి సన్నిధిలో గాయకుడు మనో

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్ప స్తంభం వద్ద కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సింహాచలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో సినీ నేపథ్య గాయకుడు మనో (నాగూర్‌బాబు), జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉన్నారు. వారికి దేవాలయ ఏఈఆర్‌ఓ సూర్యనారాయణ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మ వారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కాగా స్వామివారి దర్శనం తరువాత కలెక్టర్ దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుతో ప్రత్యేకంగా సమావేశమై పంచగ్రామాల భూ సమస్యపై చర్చించినట్టు తెలిసింది.

రాధాకృష్ణ మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

పద్మనాభం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని కుంతీమాదవస్వామి ఆలయంలో రాధాకృష్ణ మహోత్సవం కరపత్రాలను ఆలయ ఈఓ నానాజీబాబు, యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15న భీమిలిలో జరిగే రాధాకృష్ణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంక్షేమ సంఘం సభ్యులు ఎల్లయ్య, వెంకటాపురం సర్పంచ్ రమణ, ఆర్. తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు రమణ, మండల యాదవ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు వెంకటరావు పాల్గొన్నారు.

'నీటి సరఫరా విభాగంలో అక్రమ నియామకాలపై విచారణ జరపాలి'

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో చనిపోయిన కార్మికులు, ఉద్యోగ విరమణ చేసిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల స్థానంలో అక్రమంగా ఇతరులను నియమించడంపై కమిషనర్ విచారణ జరపాలని జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి కోరారు. ఆదివారం ఆయన జగదాంబ కూడలిలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జీవీఎంసీ అధికారులు గతంలో చేసుకున్న మినిట్స్ ఒప్పందం ప్రకారం టర్న్‌కాక్, ఎలక్ట్రికల్ హెల్పర్లు, ఫిట్టర్ హెల్పర్లు, సెమీ స్కిల్డ్, స్కిల్డ్ వర్కర్లకు కేటగిరీ-2 కింద వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐటీఐ విద్యార్హత ఉన్నవారికి స్కిల్డ్, డిప్లమో, ఇంజనీరింగ్ వారికి హైలీస్కిల్డ్ వేతనాలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రైవాడ కెనాల్ కార్మికులకు మాత్రమే కౌన్సిల్ అజెండాలో చేర్చడం సరికాదన్నారు. ఇతర యూనియన్ నేతలతో కలిసి నీటి సరఫరా విభాగం అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయనతో పాటు యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. ఆనంద్‌కుమార్ ఉన్నారు.

గండి బాబ్జీకి అభినందనలు



గండి బాబ్జీని అభినందిస్తున్న టీడీపీ నేతలు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన గండి బాబ్జీని టీడీపీ నాయకులు అభినందించారు. ఆదివారం వారు జిల్లా పార్టీ కార్యాలయంలో బాబ్జీని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోలమరశెట్టి శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గ నాయకులు వెల్లంకి భరత్, గలీగల్ సెల్ అధ్యక్షుడు బత్తి రాజశేఖర్, బీసీ సెల్ అధ్యక్షుడు తమ్మిన విజయకుమార్, విల్లూరి చక్రవర్తి, మజ్జి త్రినాథరావు, సారిపల్లి మహేశ్, తిరుమలదేవి, నక్కా పద్మావతి, కవిత, బొడ్డేపల్లి లలితకుమారి, అల్లూరి సత్యనారాయణ, పాల్గొన్నారు.

సింహగిరిపై విద్యుద్దీపాల శంఖు, చక్ర, తిరునామాలు ప్రారంభం



సింహగిరిపై ప్రముఖ వ్యాపార సంస్థ జీఆర్‌టీ సుమారు రూ.1.5 కోట్లతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల శంఖు, చక్ర, తిరునామాలను ఆదివారం సాయంత్రం దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవో వేంద్ర త్రినాథరావు, ఎమ్మెల్యే గణబాబు, తదితరులు పాల్గొన్నారు. - సింహాచలం

మధ్యాహ్న భోజనానికి సరికొత్త మెనూ!

... 5వ పేజీ తరువాయి

మెనూ రూపొందించేందుకు ప్రాంతాల వారీగా వంట ఏజెన్సీలతో విజయవాడలో సమావేశం నిర్వహించారు. ఇందులో ఉత్తరాంధ్ర ప్రజలు ఎక్కువగా వైట్‌రైస్‌తో కూరలు తినడాన్ని ఇష్టపడతారని వంట ఏజెన్సీలు సూచించాయి. దీంతో ప్రాంతాలవారీగా భోజనం అందించాలని మంత్రి ఆదేశించారు. ఇందులో భాగంగా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు రూపొందించిన ఒకే విధమైన మెనూ రూపొందించారు. దీనిని ఈ నెల 14 నుంచి అమలుచేయాలని ప్రతిపాదించారు. అదేరోజు మెగా టీచర్, పేరెంట్స్ సమావేశానికి సన్నాహాలు చేశారు. కానీ ఈ సమావేశం వచ్చేనెలకు వాయిదా పడిది. ఈ నేపథ్యంలో కొత్త మెనూ ఎప్పుడు అమల్లోకి వచ్చేదీ త్వరలో చెబుతామని విద్యాశాఖ వెల్లడించింది. కొత్త మెనూ ఉత్తరాంధ్ర ప్రజల అలవాట్లకు అనుగుణంగా ఉందని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు అన్నారు. గత ప్రభుత్వంలో అమలుచేసిన మెనూను చాలామంది విద్యార్థులు ఇష్టపడలేదన్నారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. ఇదిలావుండగా కొత్త మెనూలో రసం బదులు పప్పు అందిస్తే పోషక విలువలతో కూడిత భోజనం అందుతుందన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ మార్పులు చేయాలని కోరారు.

దోమల నియంత్రణకు డ్రోన్లు

... 5వ పేజీ తరువాయి

లార్వాలు, దోమలు గాలిపీల్చుకునేందుకు అవకాశం లేక చనిపోతాయని అధికారులు చెబుతున్నారు. వారం రోజుల తర్వాత ఆయా చెరువుల్లో ఇంకా దోమలు, లార్వాలు జీవించి ఉన్నాయా? చనిపోయాయా అన్నది అనేది నిర్ధారించుకున్న తర్వాత ఇకపై ప్రతినెలా స్ప్రేయింగ్ చేయించే అంశంపై నిర్ణయం తీసుకోవాలని యోచిస్తున్నట్టు చెబుతున్నారు.


హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

... 5వ పేజీ తరువాయి

కడుపునొప్పిగా ఉందని చెప్పడంతో వార్డెన్లు అప్రమత్తమై ఆస్పత్రికి తరలించి, వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కాగా చికిత్స చేస్తున్న వైద్యులు ఏ విషయం చెప్పడంలేదు. నలుగురు విద్యార్థినులను వార్డుకు తరలించగా, ముగ్గురు వైద్యుల పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. విషయం తెలుసుకున్న ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ కార్యాలయం సూపరింటెండెంట్ గణేష్ ఆదివారం రాత్రి ఆస్పత్రికి వెళ్లి తల్లిదండ్రులు, వైద్యులతో మాట్లాడారు. తరువాత ఆర్ఐవో పి.మురళీధర్ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితి తెలుసుకున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

ఎంవీపీ కాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల నిర్వహణ తీరును చూస్తూ ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తుంది. నగరంలో ప్రధాన ప్రాంతంమైన ఈ కాలనీలో



డీఆర్‌డీఏ కార్యాలయం సమీపంలో..

విద్యుత్ స్తంభాలకు తీగెలు అల్లుకోవడంతో సరఫరాకు తరచూ అంతరాయం

అధిక శాతం విద్యుత్ స్తంభాలకు పొదులు అల్లుకుని తీగెలు కప్పేసి ఉన్నాయి. ముఖ్యంగా.. వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి నుంచి డీఆర్‌డీఏ కార్యాలయం వెళ్లే ప్రధాన రహదారిని అనుకుని కింది నుంచి విద్యుత్తు స్తంభాలను పూర్తిగా పొదులు అల్లుకున్నాయి. వీటి తొలగింపునకు ఆ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఈ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలిగినప్పుడు పరిశీలించేందుకు ఆ శాఖ కింది స్థాయి సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు స్తంభాలకు అల్లుకున్న పొదుల కారణంగానే విద్యుత్ సరఫరా నిలిచి పోతోందని స్థానికులు అంటున్నారు. ఈదురు గాలులు వీచినప్పుడు, వర్షాలు పడినప్పుడు ఈ తీగెల కారణంగా వైర్లు రాపిడికి గురై నిప్పులు ఎగజిమ్ముతుంటాయని, ఆ సమయంలో భయం వేస్తుందని పేర్కొంటున్నారు. కొన్నేళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా.. ప్రమాదకరమని తెలిసినా చూసీచూడనట్టు వ్యవహరించడం మినహా తీగెల తొలగింపునకు ఆ శాఖ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి కనెక్షన్ ఇవ్వడానికి సర్వీసు వైర్లను స్తంభాలు పని చేయాల్సి ఉంటుంది. ఒక్కోసారి ఇళ్లల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ ఇంటికి సరఫరా పునరుద్ధరించేందుకు



మెడికవర్ ఆస్పత్రి నుంచి డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లే రహదారిలో..

స్తంభాలు ఎక్కి పరిశీలించాల్సి ఉంటుంది. మరి.. కింది నుంచి పై వరకూ స్తంభాలకు తీగెలు దట్టంగా అల్లుకొని ఉంటే సిబ్బంది వారి విధులను ఎలా నిర్వర్తించగలరని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

☛ సంక్షిప్తంగా..



కనక మహాలక్ష్మి అమ్మవారు

కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలకు రేపు పందిరిరాట

జగదాంబ కూడలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలకు మంగళవారం రాట ముహూర్తంతో ఆలయ అధికారులు శ్రీకారం చుట్టనున్నారు.కార్తీక ఏకాదశి రోజున అమ్మవారి పందిరిరాట వేస్తున్నట్టు అధికారులు తెలిపా రు. డిసెంబరు రెండు నుంచి 30వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మార్గశిర పందిరిరాట వేసి అమ్మవారి పూజల్లో పాల్గొంటారని ఈవో కె.శోభారాణి పేర్కొన్నారు.

కంబాలకొండలోకి 3 కొండచిలువలు



తాను పట్టుకున్న పాములను కంబాలకొండలో విడిచి పెడుతున్న కిరణ్‌కుమార్

ఆరిలోవ, నవంబరు 10 : (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఎండాడ, ఆర్ అండ్ బీ ప్రాంతాల్లో పట్టుకున్న మూడు కొండ చిలువలను స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్ ఆదివారం కంబాల కొండ అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు సమక్షంలో విడిచి పెట్టారు. ఈ సందర్భంగా తాయన మాట్లాడుతూ తాను ఇప్పటి వరకూ ఏపీ, ఒడిశా సుమారు 30 వేల వరకు పాములను పట్టుకొన్నట్టు తెలిపారు. వాటిని సురక్షిత ప్రాంతాలైన అటవీ ప్రాంతంలో విడిచి పెడుతుంటానని చెప్పారు.

నేడు జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక

వెంకోజీపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

సినిమా గైడ్

- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
- **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
- **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 32, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 38, బీరకాయలు 30, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 50, క్యాబేజీ 34, క్యారెట్ 52 దొండకాయలు 30, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది)60, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోస కాయలు 40, వె ల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 78, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 76, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	107
ఫారం ధర	123
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

భక్తిశ్రద్ధలతో గురునానక్ జయంతి వేడుకలు



గురుగ్రంథ్ సాహెబ్‌తో సిక్కుల యాత్ర



రోడ్లు ఊడ్చుతూ యాత్ర ముందుకు వెళుతున్న సిక్కు మహిళలు

సీతంపేట, నవంబరు 10 : (ఆంధ్రజ్యోతి) : గురుద్వార్ కూడలిలో గల గురుద్వార్ మందిరంలో గురునానక్ జయంతి వేడుకలను సిక్కులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి గురుద్వార్ మందిరంలో గురుగ్రంథ్ సాహెబ్‌కు ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు చేసి గీతాలను ఆలపించారు. మధ్యాహ్నం గురుగ్రంథ్ సాహెబ్‌ను పెద్ద వాహనంపై ఉంచి ప్రార్థనలు, పూజలు చేస్తూ యాత్రను నిర్వహించారు. సిక్కులు తాము పూజించే తల్వార్‌లను చేత బట్టి గురుద్వార్ మందిరం నుంచి ప్రార్థనలతో బయలుదేరి నగర కీర్తన యాత్రను నిర్వహించారు. సిక్కు మహిళలు రోడ్డులను చీపురుతో ఊడుస్తూ ముందుకు సాగగా, గురుగ్రంథ్ సాహెబ్‌ను రథం యాత్ర ముందుకు సాగింది.

గురుద్వార్ సద్ సంగత్ అధ్యక్షుడు డాక్టర్ డీఎస్ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక నగర కీర్తన యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ప్రార్థనలను చేసి గురుగ్రంధ్ సాహెబ్‌ను పూజించారు. గురుద్వార్ మందిరం వద్ద నుంచి బయలు దేరిన యాత్ర ద్వారకానగర్, జంగదాంబ కూడలి, బీచ్ రోడ్డు మీదుగా సాగి తిరిగి గురుద్వార్ మందిరానికి చేరింది.

ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో సిక్కు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో 'ఎర్లీ డిటెక్షన్ బెటర్ విజన్' అవగాహన ర్యాలీ

రామ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లలో కంటి వ్యాధుల పట్ల అవగాహనకు 'ఎర్లీ డిటెక్షన్ బెటర్ విజన్' పేరుతో ప్రజలకు అవగాహన కలిస్తూ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు ఆదివారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు చిన్నారులు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నేటి తరం పిల్లలో వస్తున్న బాల శుక్లాలు పిల్లల చూపుపై దుష్ప్రభావం చూపుతున్నాయన్నారు. వీటిని సకాలంలో గుర్తించినట్టయితే పిల్లలు అంధత్వం బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. నేత్ర సంరక్షణ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 7 నుంచి 14 వరకు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో పిల్లలకు సంబంధించి అనేక పోటీలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అటవీ శాఖ అమరవీరులకు నివాళి

ఆరిలోవ, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో ఆదివారం అటవీ శాఖ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. జూ క్యూరేటర్ మంగమ్మ అటవీ శాఖ అమర వీరుల చిత్రపటాలలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను కూడా లెక్క చేయకుండా వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలను అర్పించిన వీరులు ఎందరో ఉన్నారని, వారి త్యాగం స్ఫూర్తి దాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు, సిబ్బంది పాలొన్నారు.



అమర వీరులకు నివాళి అర్పిస్తున్న క్యూరేటర్ మంగమ్మ

బంగారు పతకాల విజేతలకు సన్మానం

వెంకోజీపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ స్పోర్ట్స్ ఫ్రోత్రా పవర్ లిఫ్టింగ్‌తో పాటు మరో ఆరు అథ్లెటిక్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఆళ్ల రామలక్ష్మి, ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన చిన్నారి కాళ్ల గౌతమ్‌కు ఆదివారం సాయంత్రం శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. ఇక్కడి రామాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులంతా కలిసి వీరిద్దరి గొప్పతనాన్ని కొనియాడి సత్కరించారు. ఈ సందర్భంగా కొందరు గ్రామ సభ్యులు రామలక్ష్మికి రూ.10 వేలు అందించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ 47 ఏళ్ల వయసులో కుటుంబం, ఇటు క్రీడల్లోనే కాకుండా సామాజిక సేవకు రాలిగా కూడా రామలక్ష్మి చూపిస్తున్న ఉత్సాహం అమోఘమన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మహిళలంతా ముందుకు సాగాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్న కాళ్ల గౌతమ్ కూడా రానున్న రోజుల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ రామలక్ష్మి, గౌతమ్ మాట్లాడుతూ స్వస్థలంలో తమకు లభించిన గౌరవానికి ఆనందంగా ఉందన్నారు.

కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘం గౌరవ అధ్యక్షుడు పీల వెంకటపరదేశి నాయుడు, అధ్యక్షులు ఆడారి పరదేశి నాయుడు, ఉపాధ్యక్షులు కర్రి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగ రాజు, కార్యదర్శి ఆడారి శివప్రకాష్, ఇతర కార్యవర్గం మళ్ల రవికుమార్, పొలమరశెట్టి త్రినాథ్, రాజగిరి సురేష్, మళ్ల కనకరాజు, కర్రి రఘు, మళ్ల శ్రీను, సభ్యులు కేవీఎస్ అప్పారావు, కర్రి శివకుమార్, కాళ్ల శ్రీను, మహిళలు పాల్గొన్నారు.



రామలక్ష్మి, గౌతమ్‌లను సన్మానిస్తున్న శ్రీసీతారామ సేవా సంఘం సభ్యులు

గర్భిణులకు వైద్యుల పర్యవేక్షణ అవసరం : డా.సుబ్బరాజు

సిరిపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవనశైలిలో వచ్చిన మార్పులు, ఒత్తిడి కారణంగా గర్భిణులకు వైద్యుల పర్యవేక్షణ చాలా అవసరమని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ సుబ్బరాజు పేర్కొన్నారు. ఆదివారం సిరిపురంలోని డబ్ల్యూఎన్‌ఎస్ రోడ్డు ఎదురుగా గల లోటస్ ఆస్పత్రిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన నుంచి నిరంతరం బేబీ ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్య పరీక్షలతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం, వైద్యుల సలహాలను పాటించడం వలన ఆరోగ్యవంతమైన బిడ్డను పొందవచ్చన్నారు.లోటస్ ఆస్పత్రి సీఈవో డాక్టర్ వీఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం కోసం ప్రణాళికలను రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమప్రసాద్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డా.సుబ్బరాజు తదితరులు

ముగిసిన సత్యసాయి జయంతి వేడుకలు



నారాయణ సేవ నిర్వహిస్తున్న విద్యావిహార్ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని ఎనిమిదో సెక్టరు సత్యసాయి మందిర్‌లో శనివారం నుంచి నిర్వహించిన సత్యసాయి 99వ జన్మదిన వేడుకలు ఆదివారంతో ముగిశాయి. శనివారం ప్రారంభించిన గ్లోబల్ అఖండ భజన కార్యక్రమం 24 గంటల పాటు నిరంతరాయంగా నిర్వహించి ఆదివారం సాయంత్రంతో ముగించారు. ఆదివారం మధ్యాహ్నం సత్యసాయి విద్యా విహార్ పదో తరగతి విద్యార్థులు ప్రభుత్వ మానసిక సంరక్షణ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి ఆహారం అందజేశారు. అలాగే పోషకాహారంలో భాగమైన కూరగాయలు, కిరాణా సామగ్రి, పండ్లను అందించారు. నవంబరు 23 వరకూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారని, పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు విజయవంతం చేయాలి

» పీడీఎస్‌వో నేతల పిలుపు

సిరిపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును విజయవంతం చేయాలని పీడీఎస్‌వో విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఉత్తరాంధ్ర కరువు, వలసలు-విద్య, ఉపాధిరంగ సమస్యలు-కర్తవ్యాలు' అంశంపై సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15న విజయనగరంలోని ఎంఆర్ లేడీస్ క్లబ్ వేదికగా సదస్సును నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి ఎస్సీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు, ముఖ్య అతిథిగా ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, వక్తలుగా కేంద్ర, రాష్ట్ర మాజీ సలహాదారు వైవీఎస్ మహదేవన్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.భానుమూర్తి హాజరై ప్రసంగిస్తారన్నారు.కావున విద్యార్థులు, నిరుద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు.కార్యక్రమంలో సభ్యులు ఎస్.రుద్రి, సతీష్‌కుమార్, జానకి, మణీంద్ర, వసంత్, సురేష్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఎంవీపీ కాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఉషోదయ వికాస తరంగిణి ఆధ్వర్యంలో చినజీయర్ స్వామి మహిళా ఆరోగ్య వికాస్ పేరిట నిర్వహించిన శిబిరంలో వైద్యనిపుణులు వసంత బృందం రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ప్రతినిధులు రవికుమార్, ప్రధానోపాధ్యాయులు రవికుమార్ పాల్గొన్నారు.

ఆలిండియా టేబుల్ టెన్నిస్ టోర్నీ అంపైర్‌గా శర్మ



విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎల్ఐసీ స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు మెంబరు, అంతర్జాతీయ బ్లూ బ్యాడ్జి అంపైర్ ప్యానల్ హోల్డర్ డాక్టర్ డీపీఎస్‌వై శర్మ అంపైర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈనెల 24 నుంచి చండీఘడ్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక 51వ ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి సీనియర్ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. టేబుల్ టెన్నిస్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న శర్మ...జాతీయ టోర్నీకి అంపైర్‌గా నియమితులు కావడం పలువురు హర్షం ప్రకటించారు.

జూకు పోటెత్తిన సందర్శకులు



ఏనుగుల మోటు వద్ద సందర్శకులు

ఆరిలోవ, నవంబరు 10 : (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. ఇతర దేశస్థులు కూడా ఈ పార్కును సందర్శించారు. అంతా ఏనుగుల మెటు వద్దకు వచ్చి సెల్‌ఫోన్‌తో ఫోటోలు తీశారు. సుమారు 6,590 సందర్శించారని, వీరి నుంచి రూ.5,10,739 ఆదాయం సమకూరిందని జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించాలి



నృత్యం చేస్తున్న కళాకారిణిలు

వెంకోజీపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలల ప్రతిభను పరిశీలించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈపీడీసీఎల్ మాజీ ఆపరేషన్స్ డైరెక్టర్ బి.రమేష్ పేర్కొన్నారు. విశాఖ నుంచి జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు హాజరవుతున్న స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ బాలకళాకారులకు ఆదివారం ఆయన సత్కరించారు. బ్రహ్మకుమారీ స్వరీయా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎంఎంటీసీ కాలనీ ఏపీఎస్‌ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పార్కు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా విశాఖ నుంచి నేషనల్ కల్చరల్ ఫెస్టివల్‌కు హాజరవుతున్న హర్షిత, టీనా, పూజిత చందన, జోషిత, డింపుల్ స్నేహితులను సత్కరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి రామేశ్వరి, ఏపీఎస్‌ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగాలకు బకాయి జీతాలు చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ నేతలు

సిరిపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గడిచిన మూడు నెలల బకాయి వేతనాలు 104 ఉద్యోగులకు చెల్లించాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 104 ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ పిలుపుమేరకు నిరసన దీక్ష చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వేతనాలు చెల్లించాలని ప్రభుత్వమే నేరుగా పీహెచ్‌సీ ద్వారా 104 సర్వీసులను నిర్వహించాలన్నారు. 2020 తరువాత నియమించబడిన వారికి జీవో నెంబరు 7 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ నిరసన దీక్షలో నాయకులు జి.అప్పలరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాతబాబు, భాస్కర్, నాయకులు భవ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జూలో మౌస్ డీర్ జననం

ఆరిలోవ, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో ఆదివారం మౌస్ డీర్ ఒక బుల్లి మౌస్‌డీర్‌కు జన్మనిచ్చినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. ప్రస్తుతానికి ఆరోగ్యం బాగానే ఉన్నదని తెలిపారు. ప్రసుతానికి ఈ జూ పార్కులో మూడు మౌస్‌డీర్‌లు ఉన్నాయని క్యూరేటర్ తెలిపారు వీటిలో రెండు ఆడవి, ఒకటి మగదిగా పేర్కొన్నారు. తాజాగా వీటి సంఖ్య నాలుగుకు చేరిందని ఆమె తెలిపారు.

21వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలు నమోదు చేస్తున్న అమరేంద్ర తదితరులు

పెదవాల్తేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును ఆదివారం 21వ వార్డులో ఆ పార్టీ స్థానిక అధ్యక్షుడు పీల అమరేంద్ర అధ్వర్యంలో చినవాల్తేరు, రెల్లివీధి తదితర ప్రాంతాలల్లో ఇంటింటికి వెళ్లి చేపట్టారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా బీమా సదుపాయం కూడా లభిస్తుందన్నారు. అంతేకాకుండా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యే అవకాశం కూడా కలుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయుకులు పీతల అవినాష్, వెంకట్రావు, మూర్తి యాదవ్, మాదీనా తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఐఏఎస్‌ఈ విభాగంలో 2005-06 బ్యాచ్ బీఎడ్ విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని ఐఏఎస్‌ఈ విభాగంలో 2005-06 బీఈడీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజకుమారి అధ్యక్షత వహించగా, విభాగాధిపతి డాక్టర్ టి.సరోస్‌రాజు, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, ఇతన పూర్వ విద్యార్థులు పాల్గొని అలనాటి తమ మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వీరంతా ఒకచోట కలుసుకుని తమ పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు విశాఖ క్రీడాకారులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి విశాఖ నుంచి 24 మంది అథ్లెట్లు ఎంపికయ్యారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు. డిసెంబరు 7 నుంచి భువనేశ్వర్‌లో జరిగే జాతీయ టోర్నీలో రన్స్, త్రో, జంప్ వంటి వివిధ ఈవెంట్లలో 16 మంది పురుషులు, ఎనిమిది మంది మహిళ అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. పురుషుల విభాగంలో పి.పవన్‌కుమార్, శెట్టి లోహిత్, టి.గోపాలకృష్ణ, దుడ్డు శేషు, పిట్టా జశ్వంత్ యాదవ్, కిరణ్‌సాయి, వి.శ్యామ్‌భగవాన్, సౌరభ్‌కుమార్ పాశ్వాన్, బి.రాముడు, బి.చైతన్య, కెఆర్‌వీఎం.కుమార్ దొర, మహిళల విభాగంలో బాకి శైలజ, ఎం.నాగసాయి వర్షిణి, మహ్మద్ అయేషా బాను, బోరా ప్రవల్లిక రెడ్డి, ఒమ్మి సత్య సహస్రిక, జి.తేజశ్వరి, ఎన్.బిందు హాసిని, అట్ల కాంక్షశ్రీ, జి.కావ్య పాల్గొంటారని తెలిపారు.

గ్రూప్-2 పరీక్ష వాయిదాపై నిరుద్యోగ జేఏసీ హర్షం

అక్కయ్యపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 ప్రధాన పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేదీకి వాయిదా వేయడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఇబ్బందులను పరిగణించి గ్రూప్-1 ప్రాథమిక పరీక్ష ఫలితాలు మళ్లీ 1:100 గా విడుదల చేయాలని ఏపీపీఎస్సీ వారిని, మంత్రి నారా లోకేశ్‌ను, కూటమి పెద్దలను కోరారు.

ఆలిండియా టేబుల్ టెన్నిస్ టోర్నీ అంపైర్‌గా శర్మ



విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎల్ఐసీ స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు మెంబరు, అంతర్జాతీయ బ్లూ బ్యాడ్జి అంపైర్ ప్యానల్ హోల్డర్ డాక్టర్ డీపీఎస్‌వై శర్మ అంపైర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈనెల 24 నుంచి చండీఘడ్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక 51వ ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి సీనియర్ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. టేబుల్ టెన్నిస్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న శర్మ...జాతీయ టోర్నీకి అంపైర్‌గా నియమితులు కావడం పలువురు హర్షం ప్రకటించారు.

అస్తవ్యస్త పార్కింగ్.. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు

- పట్టించుకోని అధికారులు, పోలీసులు
- లక్ష్మీనారాయణపురంలో తీరని ట్రాఫిక్ సమస్య



లక్ష్మీనారాయణపురంలో రోడ్డును ఆక్రమించి నిలిపిన వాహనాలు

అక్కయ్యపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 46వ వార్డు లక్ష్మీనారాయణపురం రోడ్డును ఆక్రమించి వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. రోడ్డుకు ఇరువైపులా షాపులు ఉండడం, వాటి ప్రచార బోర్డులు, దుకాణాలకు వచ్చిన వారి వాహనాలను రోడ్డపై నిలిపి వేస్తుండడంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు రోడ్డును ఆక్రమించి షాపుల ఎదుట ఉన్న ఫుట్‌పాత్‌పై చిరు వ్యాపారులు వివిధ రకాల అమ్మకాలు చేపడుతుండడంతో ఇక్కడ చిన్న మార్కెట్‌ను తలపించేలా ఉంటుంది. ముఖ్యంగా.. సాయంత్రం వేళ రద్దీ ఎక్కువగా నెలకొంటుంది. దీంతో ఫుట్‌పాత్‌పై నడిచే అవకాశం లేకపోవడంతో పాదచారులు రోడ్డుపైకి వచ్చి రాకపోకలు సాగిస్తుంటారు. దీనివల్ల వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. ఫలితంగా రోజూ చిన్నపాటి రోడ్డు ప్రమాదాలు సాధారణంగా మారిపోయింది. దీనిపై పోలీసులు, జీవీఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై వాహనదారులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డులో అస్తవ్యస్త పార్కింగ్, ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు చేపటి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నీటి సరఫరా విభాగంలో అక్రమ నియామకాలపై విచారణ జరపాలి

జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో చనిపోయిన కార్మికులు, ఉద్యోగ విరమణ చేసిన అవుట్ సోర్సింగ్ కార్మికుల స్థానంలో అక్రమంగా ఇతరులను నియమించడంపై కమిషనర్ విచారణ జరపాలని జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి కోరారు. ఆదివారం ఆయన జగదాంబ కూడలిలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

జీవీఎంసీ అధికారులు గతంలో చేసుకున్న మినిట్స్ ఒప్పందం ప్రకారం టర్న్‌కాక్, ఎలక్ట్రికల్ హెల్పర్లు, ఫిట్టర్ హెల్పర్లు, సెమీస్కిల్డ్, స్కిల్డ్ వర్కర్లకు కేటగిరీ-2 కింద వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐటీఐ విద్యార్హత ఉన్నవారికి స్కిల్డ్, డిప్లమో, ఇంజనీరింగ్ వారికి హైలీస్కిల్డ్ వేతనాలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రైవాడ కెనాల్ కార్మికులకు మాత్రమే కౌన్సిల్ అజెండాలో చేర్చడం సరికాదన్నారు. ఇతర యూనియన్ నేతలతో కలిసి నీటి సరఫరా విభాగం అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని దీనిపై కమిషనర్ దృష్టిసారించాలని కోరారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. ఆనంద్‌కుమార్ ఉన్నారు.

డిజిటల్ చెల్లింపులపై రైల్వేస్టేషన్‌లో అవగాహన

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చిన డిజిటల్ చెల్లింపులపై వాల్తేరు రైల్వే సిబ్బంది ఆదివారం ప్రత్యేక డ్రైవ్‌లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. క్యూ ఆర్ కోడ్ ఆధారితతో చెల్లింపులు చేసే విధానాన్ని అన్ని రైల్వే స్టేషన్లలోని జనరల్ టికెట్ కౌంటర్లు, రిజర్వేషన్ కార్యాలయలతో పాటు టికెట్ చెకింగ్ స్టాఫ్ వద్ద అందుబాటులో ఉందని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమయాన్ని ఆదా చేయడంతోపాటు నగదు రహిత టికెట్ అవసరాలను తొలగించేందుకు క్యూ ఆర్ కోడ్ డిజిటల్ చెల్లింపు దోహదపడతాయని వివరించారు. నగదు రహిత లావాదేవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు డిజిటల్ చెల్లింపులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా వాల్తేరు రైల్వే ముందుకు వెళుతోందని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ చీఫ్ సెక్రటరీ జనరల్ నరసింగరావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరసింగరావు తదితరులు

సీతంపేట, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని మార్చివేసే ప్రయత్నాలు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ చీఫ్ సెక్రటరీ జనరల్ ఎం.నరసింగరావు పిలుపునిచ్చారు. రామాటాకీస్ రోడ్డులో గల అంబేడ్కర్ భవన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్, ఆల్‌ఇండియా డిఫెన్స్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, బుద్ధుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు అలర్పించారు. 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, భారతదేశాన్ని కాపాడుకుందాం' పిలుపుతో త్వరలో దేశంలోని పలు రాష్ట్రాలలో రాజ్యాంగ అవగాహన రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ యాత్రలో దళిత, బహుజన, ప్రజాస్వామిక సంఘాలన్నీ భాగస్వామ్యం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఏపీ ఇన్‌చార్జ్ మాటూరి శ్రీనివాసరావు, రమణమూర్తి, మాటూరి రత్నకుమారి, జి.శంకర్, ఎస్.రామలింగం, మునికుమార్, జాన్‌పాల్, ఎం.రాజ్‌కృష్ణ, బొడ్డు కల్యాణరావు, భూపతి పాల్గొన్నారు.

దుర్గానగర్ గ్రామ కమిటీ చైర్మన్‌గా సత్యనారాయణ

కంచరపాలెం, నవంబరు 10 : జీవీఎంసీ 56వ వార్డు పరిధి దుర్గానగర్ (గొల్ల కంచరపాలెం) గ్రామ కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. దుర్గా యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా పల్లా సత్యనారాయణ, అధ్యక్షుడుగా పల్లా రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడుగా కుప్పా పైడిరాజు, కె.ఆదినారాయణ, కార్యదర్శిగా పొలమరశెట్టి రమేష్,జాయింట్ సెక్రటరీగా డి.భూషణంతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులుగా కె.చంద్రరావు, ఎస్.అనంత్ కుమార్, దాలిరాజు, పల్లా శివ, ఎం.సత్యనారాయణమూర్తి, ఎస్.ప్రసాద్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను చైర్మన్ పల్లా సత్యనారాయణతో పాటు గ్రామ పెద్దలు అభినందించారు. గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చైర్మన్ సత్యనారాయణ పేర్కొన్నారు.

55వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న సుజాత, ఈశ్వరరావు తదితరులు

కంచరపాలెం, నవంబరు 10 : కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో టీడీపీ సభ్యత్వ నమోదును పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా చేపడుతున్నారు. గత వారం రోజుల నుంచి జీవీఎంసీ 55వ వార్డులో రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నారు. వార్డు పరిధిలోని గంగన్ననగర్, యల్లబిల్లివారి వీధి, జోగారావు నగర్‌లో ప్రత్యేక క్యాంపుల ద్వారా సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెల్లంకి భరత్ విచ్చేశారు. ఈసందర్భంగా సుజాత మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈశ్వరరావు, కె.బాలకృష్ణ, సతీష్, వెంకటరావు, మహేష్, పైడికొండ, ఎస్.చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలాగే జీవీఎంసీ 48వ వార్డులో సీనియర్ నాయకులు గొర్లె అప్పారావు, నాగమణి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. పలువురు స్థానికులు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెహ్రూ గొప్ప దార్శనికుడు

- ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పూర్వ ఉపకులపతి బాలమోహన్‌దాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్

సీతమ్మధార, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశ ప్రథమ ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువరానివని, ఆయన గొప్ప దార్శనికుడని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పూర్వ ఉపకులపతి బాలమోహన్‌దాస్ పేర్కొన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, పంచశీల విధానం, ప్రపంచ శాంతి స్థాపనలో నెహ్రూ నిర్వహించిన పాత్ర కీలకమని కొనియాడారు. దేశ నవ నిర్మాణంలో నెహ్రూ పాత్ర గుర్తించదగినదన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో గల గాంధీ సెంటర్‌లో బాలవికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో 'నెహ్రూ, భారతదేశం' అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. నెహ్రూ ముందు చూపుతో వ్యవహరించి దేశ అభివృద్ధి కోసం అనేక సంస్కరణలు, ప్రణాళికలు రూపొందించారన్నారు.

కార్యక్రమంలో ఆచార్య పి.పద్దయ్య, సీనియర్ అడ్వకేట్ సీఎస్సీ కృష్ణారావు, డాక్టర్ బాబ్జీ, మున్నార్, ద్విభాష్యం రాజేశ్వరరావు, జేపీ శర్మ, హుస్సేన్, రచయిత ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు పోలీసు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ విజయ్‌కుమార్

సీతంపేట, నవంబరు 10 : (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎవరైనా ఆసాంఘిక కార్యకలపాలకు పాల్పడినా, సత్ప్రవర్తనతో నడవడిక కొనసాగించకపోయినా అటువంటి వారిపై చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటుమని సీఐ విజయ్‌కుమార్ రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేశారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లకు పలు సూచనలు చేశారు.



కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలకు రేపు పందిరిరాట

జగదాంబ కూడలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలకు మంగళవారం రాట ముహూర్తంతో ఆలయ అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. కార్తీక ఏకాదశి రోజున అమ్మవారి పందిరిరాట వేస్తున్నట్టు అధికారులు తెలిపారు. డిసెంబరు రెండు నుంచి 30వ తేదీ వరకు మార్గ శిర మాసోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మార్గశిర పందిరిరాట వేసి అమ్మవారి పూజల్లో పాల్గొంటారని ఈవో కె.శోభారాణి పేర్కొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి

మహారాణిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి రాఘవేంద్రస్వామి ఆలయంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో సరస్వతీ గాత్ర కచేరి అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం రాఘవేంద్రస్వామి మఠంలో ఆంధ్ర విశ్వకళా పరిషత్ సంగీత విభాగానికి చెందిన ఆచార్య కె.సరస్వతి నిర్వహించిన తన గాత్ర కచేరీతో శ్రోతలను ఓలలాడించారు. త్యాగరాజస్వామి సంకీర్తనలు, ముత్తుస్వామి దీక్షితార్ కృతులు, పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచించిన కీర్తనలను తన మృదు మధుర గాత్రాలతో శ్రావ్యంగా ఆలపించారు. రాంచరణ్, ఎం.రవి, జి.వెంకటేశ్‌లు వాయిద్య సంగీత సహకారాన్ని అందించారు. ముందుగా ఐవీఎల్ శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి అందరూ నివాళులర్పించారు. కార్యక్రమంలో పేరాల బాలమురళీకృష్ణ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఎ.వెంకటరావు, జగన్మోహనరావు, మధుబాబు, సుబ్రహ్మణ్యం, మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉబ్బిన సిరలు సమస్యపై అవగాహన

మహారాణిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శరీరంలో ఉబ్బిన సిరలు వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలు-పరిష్కారంపై ఆదివారం గో వ్యాస్క్యులర్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఆదివారం కేజీహెచ్ డౌన్‌లో గల విజేత ఆస్పత్రి సముదాయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఈస్ట్ డివిజన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కె.లక్ష్మణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉబ్బిన సిరలు వల్ల ఏర్పడే అనారోగ్య సమస్యల పరిష్కారం కోసం గో వాస్క్యులర్ సంస్థ తమ వైద్య సేవలను విశాఖలో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం వైద్య నిపుణులు డాక్టర్ సంపత్ వాదిత్య ఆధ్వర్యంలో పలువురు రోగులకు ఉచిత డాప్లర్ స్కానింగ్‌తో వైద్య పరీక్షలు చేసి తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి పైలా సన్నిబాబు, నరవ రాంబాబు, సందీప్, డాక్టర్ కూర్మనాథ్, డాక్టర్ ఎస్‌వీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

8న దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ తొలిసారిగా డిసెంబరు ఎనిమిది నుంచి 11వ తేదీ వరకు హిందూస్థాన్ జింక్ క్రికెట్ మైదానంలో దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంటును నిర్వహించనున్నట్టు సోషల్ యాక్టివిస్ట్ ఉరుకూటి చైతన్య పేర్కొన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామని, టోర్నమెంటుకు తనతో పాటు టీడీపీ 70వ వార్డు ఇన్‌చార్జి చట్టి గోపి సహాయ సహకారాలను అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని పది జిల్లాల నుంచి పది టీమ్‌లు ఈ పోటీలో పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సింహాచల దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ్, టోర్నమెంట్ నిర్వాహకులు మణికంఠ, హేమసుందర్, బాలరామకృష్ణ, షేక్ హుస్సేన్, సూరిబాబు, నందన్‌సాయి, బి.బాలకృష్ణ, కోదండం, తదితరులు పాల్గొన్నారు.

గాంధీగిరి పేరిట ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



వాహనదారునికి ఉచిత హెల్త్ చెకప్ కూపన్‌ను అందజేస్తున్న దృశ్యం

మహారాణిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గాంధీగిరి పేరిట వాహనదారులకు వివరిస్తూ ఆదివారం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. నగర ట్రాఫిక్ పోలీస్ విభాగం, ఓమ్ని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో రామ్‌నగర్ వాల్తేర్ క్లబ్, జగదాంబ సెంటర్, మహారాణిపేట, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ భద్రతా నిబంధనలను పాటించాలని కోరుతూ వాహనచోదకులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్ల వినియోగదారులు సీట్ బెల్టులను ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో డ్రైవింగ్ చేయరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల చోటుచేసుకునే అనర్థాలను వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా వాహనచోదకులకు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా కూపన్లను అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ విభాగం అధికారులు, ఓమ్ని ఆస్పత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏయూలో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

చేరేందుకు ఉన్నతాధికారులకు లేఖరా శారు. సాధారణంగా దీనిని పరిశీలించి విధుల్లోకి తీసుకో వాలి. కానీ ఎస్3 సెక్షన్ ఉన్నతాధికారులు అతడిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. సెలవు పెట్టినప్పటికీ అబ్‌స్కాండ్ (అదృశ్యం) అంటూ ఉన్నతాధికారులు చూపించి రూ.లక్ష జరిమానా విధించారు. ప్రస్తుతం ఆ ఉద్యోగి వేతనంలో ప్రతినెల రూ.8,500 చొప్పున కోత విధిస్తున్నారు.

నిబంధనలు తోసిరాజని..

నిబంధనల మేరకు ఉద్యోగి అబ్‌స్కాండ్ అయితే మెమో ఇవ్వాలి. శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. కానీ ఉద్యోగి అధికారికంగా లీవ్‌లో ఉన్నా అబ్‌స్కాండ్ పదాన్ని వాడి జరిమానా విధించారు. ఇదే సెక్షన్‌లో టైపిస్ట్ సెలవు పెట్ట కుండా, ఉన్నతాధికారులకు కనీసం సమాచారం ఇవ్వకుండా గత ఏడాది మే నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు విధులకు హాజరుకాలేదు.

సాధారణంగా దీనిని అబ్‌స్కాండ్‌గా పేర్కొం టారు. కానీ ఆ ఉన్నతాధికారికి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే సదరు ఉద్యోగి బంధువు కావడంతో లాస్ ఆఫ్‌పే కింద పరిగణలోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఉద్యో గులకు అధికారులు ఆర్డర్ కాపీలో పేర్కొన్న నిబంధనలు ఒకటే కావడం గమనార్హం. అయితే, లీవ్ పెట్టిన ఉద్యోగికి జరిమానా విధించగా, మరో ఉద్యోగికి సెలవుగా పరిగణిం చడం విశేషం. గత ఏడాది మేలో విధుల్లో చేరేందుకు పైడి శ్రీనివాస్ ఉన్నతాధికారులకు లేఖ రాసిననప్పటికీ ఈ ఏడాది ఆగస్టు వరకు వేధింపులకు గురిచేశారు. అంటే సుమారు 15 నెలలపాటు వర్సిటీకి దూరం పెట్టారు. ఓ ఉన్నతాధికారి ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకు విధులకు హాజరవుతుండడంతో శ్రీనివాస్ ప్రశ్నించడమే దీనికి కారణం గా తెలుస్తోంది. సెక్షన్ ఉన్నతాధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తనకు అనుకూలమైన వారికి మేళ్ల చేస్తుంటారని సమాచారం.

బదిలీల్లోనూ గోప్యత

సాధారణంగా సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కేడర్లకు సంబంధించిన ఉద్యోగులకు బదిలీలు చేస్తే మొత్తం జాబితాను విడుదల చేస్తారు. కానీ తాజాగా బదిలీలను గు ట్టుగా సాగిస్తున్నారు. ఉత్తర్వులను వ్యక్తిగతంగా అందిస్తు న్నారు. ఇటీవల ఇలానే ప్రక్రియ చేపట్టిన అధికారులు తాజా గా మరికొందరు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెం ట్లను బదిలీ చేశారు. ఇదే పరిపాలనా విభాగంలోని మరో కీలక సెక్షన్ సూపరింటెండెంట్ కూడా తనకు నచ్చినట్టుగా పనిచేస్తారనే ఆరోపణలున్నాయి. ఇతడు గత వీసీ ప్రసాదరెడ్డికి నమ్మిన బంటుగా పనిచేసేవారని పేరుంది. ఇప్పటికీ వర్సిటీ ఉన్నతాధికారుల మాటను లెక్క చేయరన్న ప్రచార మూ ఉంది. వర్సిటీ గ్రౌండ్స్‌లో దీపావళి దుకాణాలకు అను మతుల విషయంలోనూ ఆయన భారీగానే లబ్ధి పొందినట్టు ఉద్యోగులే చెబుతున్నారు.

గాడితప్పిన క్లాప్!

... 5వ పేజీ తరువాయి

లక్ష్యం నెరవేరడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూజర్ చార్జీలను రద్దుచేసింది. దీంతో జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి బిల్లులు చెల్లిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు చెత్త సేకరణపై కాంట్రాక్టర్‌ను నిలదీయడం లేదు. జీవీఎంసీలోని కొంతమంది పాలకవర్గ పెద్దలు కాంట్రాక్టర్‌కు మేలుచేసేలా సహకరిస్తుండడంతో అధికారులు బిల్లులు చెల్లించేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా క్లాప్‌కాంట్రాక్టర్‌కు బిల్లు పెండింగ్‌లో ఉందని, తక్షణం చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, వాహనాలను సక్రమంగా నడపాలని మాత్రం సూచించడం లేదని ప్రజారోగ్య విభాగం సిబ్బంది విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కమిషనర్ పి.సంపత్‌కుమార్ దృష్టిసారించి క్లాప్‌వాహనాల పనితీరును గాడిన పెట్టేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనానికి సరికొత్త మెనూ!

... 5వ పేజీ తరువాయి

మెనూ రూపొందించేందుకు ప్రాంతాల వారీగా వంట ఏజెన్సీలతో విజయవాడలో సమావేశం నిర్వహించారు. ఇందులో ఉత్తరాంధ్ర ప్రజలు ఎక్కువగా వైట్‌రైస్‌తో కూరలు తినడాన్ని ఇష్టపడతారని వంట ఏజెన్సీలు సూచించాయి. దీంతో ప్రాంతాలవారీగా భోజనం అందించాలని మంత్రి ఆదేశించారు.

ఇందులో భాగంగా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు రూపొందించిన ఒకే విధమైన మెనూ రూపొందించారు. దీనిని ఈ నెల 14 నుంచి అమలుచేయాలని ప్రతిపాదించారు. అదేరోజు మెగా టీచర్, పేరెంట్స్ సమావేశానికి సన్నాహాలు చేశారు. కానీ ఈ సమావేశం వచ్చేనెలకు వాయిదా పడిది. ఈ నేపథ్యంలో కొత్త మెనూ ఎప్పుడు అమల్లోకి వచ్చేదీ త్వరలో చెబుతామని విద్యాశాఖ వెల్లడించింది.

కొత్త మెనూ ఉత్తరాంధ్ర ప్రజల అలవాట్లకు అనుగుణంగా ఉందని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు అన్నారు. గత ప్రభుత్వంలో అమలుచేసిన మెనూను చాలామంది విద్యార్థులు ఇష్టపడలేదన్నారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. ఇదిలావుండగా కొత్త మెనూలో రసం బదులు పప్పు అందిస్తే పోషక విలువలతో కూడిత భోజనం అందుతుందన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ మార్పులు చేయాలని కోరారు.

హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

... 5వ పేజీ తరువాయి

కడుపునొప్పిగా ఉందని చెప్పడంతో వార్డెన్లు అప్రమత్తమై ఆస్పత్రికి తరలించి, వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కాగా చికిత్స చేస్తున్న వైద్యులు ఏ విషయం చెప్పడంలేదు. నలుగురు విద్యార్థినులను వార్డుకు తరలించగా, ముగ్గురు వైద్యుల పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. విషయం తెలుసుకున్న ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ కార్యాలయం సూపరింటెండెంట్ గణేష్ ఆదివారం రాత్రి ఆస్పత్రికి వెళ్లి తల్లిదండ్రులు, వైద్యులతో మాట్లాడారు. తరువాత ఆర్ఐవో పి.మురళీధర్ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితి తెలుసుకున్నారు.

దోమల నియంత్రణకు డ్రోన్లు

... 5వ పేజీ తరువాయి

లార్వాలు, దోమలు గాలిపీల్చుకునేందుకు అవకాశం లేక చనిపోతాయని అధికారులు చెబుతున్నారు. వారం రోజుల తర్వాత ఆయా చెరువుల్లో ఇంకా దోమలు, లార్వాలు జీవించి ఉన్నాయా? చనిపోయాయా అన్నది అనేది నిర్ధారించుకున్న తర్వాత ఇకపై ప్రతినెలా స్ప్రేయింగ్ చేయించే అంశంపై నిర్ణయం తీసుకోవాలని యోచిస్తున్నట్టు చెబుతున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపిన పూర్వ విద్యార్థులు

మహారాణిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకాశరావుపేట ఎంసీయూపీ పాఠశాలకు చెందిన 1975, 1982, 1985 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్కూల్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, పార్వతి, విజయలక్ష్మి, జాస్మిన్, సీతారామలక్ష్మి, రోజా, తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల తెలికుల సంఘం ఆత్మీయ సమావేశం

మహారాణిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గాండ్ల తెలికులకు మెరుగైన వసతులు, అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సంక్షేమ సంఘం ముందుకు సాగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ కూడలిలోని ఎన్‌జీవో హోమ్‌లో ఏజీటియూపీఎస్ఎస్ ఉత్తరాంధ్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తిరుపతి, విశాఖ, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో సేవలందించేందకు తమ సంఘం ముందు వరుసలో ఉంటుందన్నారు. జామి పద్మావతిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు పెబ్బిలి రవికుమార్, గిరి, శ్రీనివాస్, తదతరులు పాల్గొన్నారు

పేదలకు అండగా నిలిచేది టీడీపీయే..

» రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు అండగా నిలిచేది, వారి బతుకులకు భరోసా కల్పించేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీ కూడలిలో ఆదివారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు గత ఐదేళ్ల వైసీపీ హయాంలో చీకటి పాలనను చూశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలంతా ఊపిరి పీల్చుకోగలుగుతున్నారన్నారు. జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమని, అందువల్ల అధిక సంఖ్యలో పార్టీ సభ్యత్వాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొసెట్టి అప్పారావు, తాటికొండ సుదర్శనరావు, పి.ఉగ్రం, వి.వెంకన్న, కె.లక్ష్మి, చంద్రమ్మ, మీరాబాయి, తదితరులు పాల్గొన్నారు.



హౌసింగ్ బోర్డు కాలనీలో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న 'పల్లా'

గ్రామాల అభివృద్ధికి చర్యలు

అగనంపూడి: గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. 79వ వార్డు పరిధి పాతఅగనంపూడి, గల్లవానిపాలెం వేపచెట్టు జంక్షన్ ప్రాంతాల్లో రూ.రెండు కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. గౌరీనగర్‌లో రూ.55 లక్షల వ్యయంతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం పల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఈ అప్పారావు, నాయకులు కర్రి దోశేంద్ర, కరణం పైడిరాజు, జగదీశ్, ఎం.విజయ్, సత్యారావు, ఎస్.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారాన్ని ప్రజలే కాపాడుకోవాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు పుణ్యవతి

మల్కాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ప్రజలంతా అడ్డుకోవాలని, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ఎంతోమంది బలిదానాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంటును అందరూ కాపాడుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్.పుణ్యవతి అన్నారు. మల్కాపురంలో సీపీఎం తొమ్మిదో మహాసభ ఆదివారం జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో హెచ్‌పీసీఎల్, డాక్‌యార్డు, షిప్‌యార్డు వంటి భారీ పరిశ్రమలు ఉన్నప్పటికీ ఆ స్థాయిలో మల్కాపురం ప్రాంతం అభివృద్ధి చెందకపోవడం అన్యాయమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేస్తుందని, తద్వారా దేశానికి ఎంతో నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటుపరం చేయడం వల్ల దేశంలో నిరుద్యోగం బాగా పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు స్టీల్‌ప్లాంటును కాపాడతామని చెప్పి, అధికారంలోకి వచ్చాక బీజేపీతో చేతులు కలిపి ఉక్కు గురించి కనీసం ప్రశ్నించడం లేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. మరోపక్క ట్రూ అప్ చార్జీల పేరిట విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచడం దారుణమని పుణ్యవతి పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు ఆర్కేఎస్‌వీ కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, కె.పెంటారావు, ఆర్.విమల, ఎల్.కృష్ణ, పైడిరాజు, ఆర్.లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'



నెట్‌బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కూర్మన్నపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమనీ, క్రీడలతో బంగారు భవిష్యత్తు లభిస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు 87వ వార్డు కణితి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. అనంతరం పల్లా మాట్లాడుతూ సచిన్ టెండూల్కర్, ధోనీ, పీవీ సింధు వంటి వారు క్రీడల్లో రాణించడానికి వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో జిల్లాకు చెందిన బాలికల జట్టు ఫైనల్స్‌కు చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సునీత, హెచ్ఎం బి.సూర్యప్రకాశ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.మన్నాజీ, నారాయణరావులను, కోచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే 'గాజువాక' ఏడో స్థానం

ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్ధా లక్ష్మీనారాయణ

గాజువాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదులో గాజువాక నియోజకవర్గం రాష్ట్రంలోనే ఏడో స్థానంలో నిలిచిందని పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్ధా లక్ష్మీనారాయణ అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీలోగా బూత్ కమిటీలను పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు గాజువాకలో 34 వేల మంది బీజేపీ సభ్యత్వం తీసుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. సభ్యత్వ నమోదులో జిల్లాలో రెండో స్థానంలో గాజువాక నిలిచిందన్నారు. నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ గాజువాకలో పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు పొలిమేర శ్రీనివాసరావు, సొంబాబు, రోహిణి, నాగేశ్వరరావు, దిలీప్, సత్యారావు, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కథలు ఆలోచింపజేసేవిగా ఉండాలి

నాటక రచయిత, నటాలి సంస్థ అధ్యక్షుడు కొత్తపల్లి బంగార్రాజు

పెదగంట్యాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రచయితలు రాసే కథలు పాఠకులను ఆలోచింపజేసేవిగా ఉండాలని ప్రముఖ నాటక రచయిత, నటాలి సంస్థ అధ్యక్షుడు కొత్తపల్లి బంగార్రాజు అన్నారు. వినాయకనగర్‌లో నటాలి నాటక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావు (కారా మాస్టారు) శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బంగార్రాజు మాట్లాడుతూ సమాజంలో చర్చనీయంగా మారిన అంశాలను ఇతివృత్తంగా చేసుకుని కారా మాస్టారు కథలు రాశారన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న గంగవరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పైడి హేమలత మాట్లాడుతూ శ్రీకాకుళంలో కథానిలయం భవన నిర్మాణానికి కారా మాస్టారు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు టి.శివప్రసాద్, కారా మాస్టారు అభిమానులు ఎ.కొండలరావు, కె.వెంకటేశ్వరరెడ్డి, భీమ సాహు, తదితరులు పాల్గొన్నారు. తొలుత కారా మాస్టారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కారా మాస్టారు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బంగార్రాజు, తదితరులు



సింహగిరిపై విద్యుద్దీపాల శంఖు, చక్ర, తిరునామాలు ప్రారంభం

సింహగిరిపై ప్రముఖ వ్యాపార సంస్థ జీఆర్‌టీ సుమారు రూ.1.5 కోట్లతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల శంఖు, చక్ర, తిరునామాలను ఆదివారం సాయంత్రం దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవో వేండ్ర త్రినాథరావు, ఎమ్మెల్యే గణబాబు, తదితరులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి/సింహచలం

వెంకటాద్రిపై ముగిసిన పవిత్రోత్సవాలు

పెందుర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీవారి తిరువీధి, ఊంజల సేవ, పంచామృతాభిషేకాలు, హోమం, కల్యాణోత్సవాలను నిర్వహించారు. ముగింపు రోజున స్వామివారి మూలవిరాట్‌కు పవిత్ర బంధనం చేసి విసర్జన చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న హోమాలకు పూర్ణాహుతి చేశారు.



పవిత్ర బంధనంతో వేంకటేశ్వరస్వామి

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 25 మంది ఎంపిక

అగనంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెంలోని గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ వెల్ ఒయాసిస్ కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల కార్యదర్శి గొన్నా హేమచంద్‌నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంపస్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో వస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు మూడు దశల్లో జరిగిన ఇంటర్వ్యూల్లో సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొనగా, 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, ఉపాధి కల్పనశిక్షణాధికారి ఓంనమశివాయ, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

12న కల్యాణ వెంకన్న ఆలయంలో ఏకాహం

వేపగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో ఈ నెల 12న కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని ఏకాహం భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అర్చకులు శ్రీనివాసస్వామి తెలిపారు. ఇందులో భాగంగా ఆ రోజు ఉదయం ఆరు నుంచి మర్నాడు ఉదయం ఆరు గంటల వరకు స్వామివారి భక్తి గీతాలను ఆలపించడం జరుగుతుందన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

మల్కాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గ పరిధి ములగాడలో పలు పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ భుజంగరావు ఆదివారం ఉదయం పరిశీలించారు. రెండు రోజుల పాటు ఆయన సిబ్బందితో కలిసి ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. కొత్తగా ఓటర్లగా నమోదు చేసుకోవాలన్నా, మార్పులు, చేర్పులు అంశాలకు సంబంధించి బీఎల్‌వోలు ఎలా పనిచేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బీఎల్‌వోలు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటారని, వారి సేవలు అవసరమైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గండి బాబ్జీకి అభినందనలు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన గండి బాబ్జీని టీడీపీ నాయకులు అభినందించారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాబ్జీని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గ నాయకులు వెల్లంకి భరత్, గజీగల్ సెల్ అధ్యక్షుడు బత్తి రాజశేఖర్, బీసీ సెల్ అధ్యక్షుడు తమ్మిన విజయకుమార్, విల్లూరి చక్రవర్తి, మజ్జి త్రినాథరావు, సారిపల్లి మహేశ్, తిరుమలదేవి, నక్కా పద్మావతి, కవిత, బొడ్డేపల్లి లలితకుమారి, అల్లూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాతృశ్రీనగర్ ఆలయంలోని శివలింగం

శివాలయంలో సామూహిక అభిషేకాలు

కూర్మన్నపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి మాతృశ్రీనగర్ శివాలయంలో ఆదివారం ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతిల ఆధ్వర్యంలో సామూహిక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు బాదంపూడి వ్యాగ్వేశ్వరశర్మ పర్యవేక్షణలో పంచామృతాలు, సహస్రనామాలతో అర్చనలు, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణం పూర్తి



భరత్‌నగర్ రోడ్డులోని కాలువ

వేపగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు పరిధి భరత్‌నగర్ రోడ్డులో గొల్లనారాయణపురం కలిసే ప్రాంతంలో కాలువ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇక్కడ రహదారికి ఇరువైపులా సరైన కాలువలు లేక చిన్నపాటి వర్షం కురుసినా నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లేది. ముఖ్యంగా సింహాద్రి ఆస్పత్రి దిగువ నుంచి గొల్లనారాయణపురాన్ని అనుసంధానం చేసే మార్గంలో రహదారికి ఒకవైపు మాత్రమే కాలువ ఉండగా, మరోవైపు పూర్తిగా శిథిలమైంది. దీంతో సుమారు రూ.పది లక్షలతో కాలువ నిర్మాణ పనులు చేపట్టారు.

బీజేపీలోకి వైసీపీ నాయకులు

పెందుర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట,ముదపాక గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు బీజేపీలో చేరారు. అనకాపల్లిలో గల బీజేపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు వీరికి బీజేపీ కండువాలు వేసి ఆహ్వానించారు. మాజీ ఎంపీటీసీ బంధం రాంబాబు, ముదపాక శివ, బంధం అప్పలరాజు, గొంప నూకరాజు, బంధం షణ్ముఖ్, సరిపల్లి దాసు, సన్నిబాబు, ఈశ్వరరావు బీజేపీలో చేరారు.

సినిమా గైడ్

● **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
● **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
● **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
● **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
● **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 32, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 38, బీరకాయలు 30, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 50, క్యాబేజీ 34, క్యారెట్ 52 దొండకాయలు 30, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 60, బరబటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోసకాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 78, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 72, దేముడుచిక్కుడు 76, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్రాయ్	
రైతు ధర	107
ఫారం ధర	123
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234



వై.జంక్షన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

పోర్టు కాలుష్య సమస్యను పరిష్కరించాలని ఆందోళన

గాజువాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టు కాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అన్నారు. పోర్టు కాలుష్య సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గాజువాక వై-జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు నిర్వాసిత ప్రాంతాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలన్నారు. సుమారు 20 ప్రాంతాలు గంగవరం పోర్టు మూలంగా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కాలుష్యం కారణంగా ఇటీవల కేన్సర్, ఊపిరితిత్తుల వ్యాధుల బాధితులు అధికమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలుష్య నివారణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.రమణ, త్రినాథస్వామి, అప్పారావు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఉక్కు ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు

గాజువాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించే విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఆదివారం సీఐటీయూ ప్లాంట్ నాయకుల ఆధ్వర్యంలో పాత గాజువాక జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు విచ్చే విషయంలో యాజమాన్యం చాలా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఓ పక్క ఉత్పత్తి పెంచుతామని చెబుతున్న యాజమాన్యం, మరో పక్క కార్మికుల సంఖ్య తగ్గించటం, కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ఆత్మస్థైర్యం దెబ్బతీస్తుందన్నారు. గత కొన్ని నెలలుగా జీతాలు లేక ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి తీసేందుకు యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జీతాల విషయంలో యాజమాన్యం తక్షణమే స్పందించకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఉక్కు కార్మిక సంఘ నాయకులు జె.అయోధ్యరాం, యు.రామస్వామి, శ్రీనివాసరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

58వ వార్డులో సామాజిక భవనం ప్రారంభం

మల్కాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 58వ వార్డు పరిధి కుంచమాంబ కాలనీలో కోరమాండల్ ఎరువుల కర్మాగార యాజమాన్యం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్మించిన సామాజిక భవనాన్ని ఆదివారం ఉదయం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరమాండల్ ఎరువుల కర్మాగారం సంస్థ పారిశ్రామిక ప్రాంతంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ ఎరువుల కర్మాగారం వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సేఫ్టీ విభాగం అధికారి కె.నాగరాజు, సీఎస్ఆర్ ప్రతినిధి వెంకటరమణ, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

నామినేటెడ్ పోస్టుల్లో యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘం ప్రతినిధులు

పెందుర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి నియోజక వర్గంలో ఓటర్ల ప్రాతిపదికన మూడో స్థానంలో ఉన్న యాదవులకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వాలని కూటమి ప్రభుత్వానికి మండల యాదవ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని బంధవానిపాలెంలో జిల్లా యాదవ సంఘ ప్రతినిధి అయితి సింహాచలం ఆధ్వర్యంలో ఆదివారం సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. చట్టసభల్లో యాదవుల ప్రాధాన్యం పెరగాలని ఇందుకోసం రాజకీయ ఐక్యత సాధించాలన్నారు. పార్టీలు యాదవులను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, ఈ నిష్పత్తికి తగ్గట్టుగా రాజకీయంగా పదవులు దక్కడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల యాదవులంతా రాజకీయంగా బలోపేతం కావాలని తీర్మానించారు. పెందుర్తిలో యాదవుల కోసం సామాజిక భవన నిర్మాణానికి స్థల సేకరణ జరిపి నిధులు మంజూరను చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ ఉప్పిలి దేవీకనకరాజు, చలపతి, కాగిత ఎర్నిబాబు, శ్రీనుయాదవ్, పీతల విష్ణు, ఎస్.గణేశ్, జి.సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించే విజ్ఞాన సదస్సులు

ఆటోనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యువత విజ్ఞానాన్ని, సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు విజ్ఞాన సదస్సులు ఎంతగానో దోహదపడతాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి శ్రీనగర్ టీఎస్సార్ టీబీకే కళాశాలలో స్ప్లెండర్-2024 ఫ్రెషర్స్ డే, యూత్ ఫెస్టివల్‌ను కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ, కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పల్లా మాట్లాడుతూ యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకున్నప్పుడే విజయావకాశాలను అందిపుచ్చుకుంటారన్నారు. యువశక్తి దేశానికి ఎంతో అవసరమన్నారు. తలశిల బలరామకృష్ణ మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యను అందించేందుకు తమ విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావు, వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి యూత్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు మనో (నాగూర్‌బాబు), విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉన్నారు. వారికి దేవాలయ ఏఈఓ సూర్యనారాయణ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కాగా స్వామివారి దర్శనం తరువాత కలెక్టర్ దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుతో ప్రత్యేకంగా సమావేశమై పంచగ్రామాల భూ సమస్యపై చర్చించినట్టు తెలిసింది.



కప్పస్తంభం వద్ద గాయకుడు మనో, కలెక్టర్ హరేంధిరప్రసాద్

ధనుర్మాసోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

అగనంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 16 నుంచి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు జరగనున్నందున నెలగంట ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఈకే చారి, వెంకటలక్ష్మి, గురునాథ్, ఎం.ఉమామహేశ్వరరావు, సోమశేఖర్, నరసింగరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'కాలనీల్లోని సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం'

పెదగంట్యాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై కాలనీ సంక్షేమ సంఘాలన్నీ సమష్టిగా పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఇందుకోసం కార్యాచరణను రూపొందించాలని సంక్షేమ సంఘాల సమాఖ్య ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. సమతానగర్ హెచ్‌బీజీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సంక్షేమ సంఘాల సమాఖ్య ప్రతినిధుల సమావేశం జరిగింది. వుడా డబుల్ రోడ్డులో వాహనచోదకులు ఎదురెదురుగా రాకపోకలు సాగిస్తున్నందున రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉందని, అందువల్ల ఇక్కడ వన్ వేగా మారిస్తే బాగుంటుందన్నారు. దల్లిపాలెం, సిద్ధేశ్వరం, సమతానగర్ రహదారులపై భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు బి.హిమంత్, తెంటు సత్యనారాయణ, పి.కృష్ణారావు, ఎన్.దుర్గబాబు, జి.సత్యారావు, సత్యంబాబు, మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ భాషలు... స్వదేశీ కొలువులు



- కనీస అర్హత ఇంటర్
- ఆరు నెలలు పాటు బోధన
- రూ. 10 వేలు ఫీజు.. వారానికి మూడు రోజులు తరగతులు
- మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

ఏయూలో గత కొన్నాళ్లుగా పలు విదేశీ భాషల కోర్సులు నిర్వహణ



ఏయూలో విదేశీ కోర్సులపై బోధిస్తున్న ప్రొఫెసర్

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :

గ్లోబలైజేషన్, డిజిటలైజేషన్ తరువాత ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో పలు సంస్థలు వ్యాపార కార్యకలాపాలను నిర్వహించాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో ఆయా దేశాల్లోని క్లైంట్స్‌తో మాట్లాడేందుకు అవసరమైన భాషా నిపుణులకు డిమాండ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా విదేశీ భాషలపై పట్టున్న వారికి భారీ వేతనాలతో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. ఈ డిమాండ్ దృష్ట్యా ఏయూలో వివిధ విదేశీ భాషలు నేర్చుకునేందుకు అనుగుణంగా కోర్సులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ అవకాశాలు వేగంగా లభిస్తున్న నాలుగు విదేశీ భాషలకు జూనియర్ డిప్లొమో కోర్సులు అందిస్తున్నారు. ఈ కోర్సుల్లో విద్యార్థులు భారీ సంఖ్యలో చేరుతుండగా, వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఆ విశేషాలకు సంబంధించిన కథనమే ఇది..



ఇవీ కోర్సులు..

ఏయూలో గత 20 ఏళ్లగా డిప్లొమో ఇన్ ఫ్రెంచ్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులో చేరాలనుకునే వారు ఇంటర్ పూర్తి చేస్తే సరిపోతుంది. 40 సీట్లు ఉన్నాయి. పది వేలు రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నేరుగా వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి వెళ్లి కోర్సులో చేరవచ్చు. ఏటా 40 సీట్లు కూడా ఫిల్ అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. అలాగే, డిప్లమో ఇన్ జర్మన్ కోర్సును నాలుగేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులో చేరడానికి ఇంటర్ అర్హతగా నిర్ణయించారు. ఇందులోనూ 40 సీట్లు ఉన్నాయి. రూ. పది వేలు ఫీజుగా నిర్ణయించారు. నేరుగా ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చు. డిప్లమో ఇన్ స్పానిష్ కోర్సును నాలుగేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఆరు నెలల కాల వ్యవధి. పది వేలు ఫీజు. 40 సీట్లు. అలాగే డిప్లమో ఇన్ జపనీస్ కోర్సును ఎనిమిదేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. అయితే, గడిచిన నాలుగేళ్లగా అడ్మిషన్లు జరగడం లేదు. ఈ ఏడాది నుంచి మళ్లీ అడ్మిషన్లు ప్రారంభిస్తున్నారు. ఈ కోర్సులో కూడా 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పది వేల రూపాయలు ఫీజు. ఆరు నెలలపాటు శిక్షణ ఉంటుంది. నేరుగా ఫీజు చెల్లించి కోర్సులో చేరవచ్చు. ఏయూలోని ఫారెన్ లాంగ్వేజెస్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఈ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఆయా కోర్సుల్లో చేరిన వారికి వారంలో మూడు రోజులు తర గతులు ఉంటాయి. ఆయా రోజుల్లో రెండు గంటల పాటు పాఠాలు బోధిస్తారు. సాయంత్రం 5.30 తరగతులు ప్రారంభమవుతాయి. ఈ కోర్సుల నిర్వహణకు వర్సిటీ అధికారులు నిపుణులను నియమించారు.

ఉద్యోగ అవకాశాలు

ఈ కోర్సులు పూర్తి చేసి ఆయా బాషలపై పట్టు కలిగిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభి స్తున్నాయి. కంటెంట్ డెవలపర్స్ ట్రాన్స్‌లేటర్స్, ఆయా దేశాలతో వ్యాపారాలు నడిపే సంస్థల్లో వీరికి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. వేతనాలు కూడా భారీగానే ఉంటున్నాయి. ఇకపోతే, ఈ కోర్సుల్లో చేరుతున్న వారిలో విద్యార్థులతో పాటు వివిధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, మహిళలు కూడా ఉన్నారు. ఇప్పటికే పలు ఐటీ, ఇతర కంపెనీల్లో పనిచేస్తూ ఆయా బాషలకు ఉన్న డిమాండ్‌ను తెలుసుకుని చేరుతున్న వారి సంఖ్య అధికంగానే ఉంటున్నట్టు చెబుతున్నారు.

విదేశీ భాషలతో మెరుగైన ఉపాధి

- ప్రొఫెసర్ జి. శశిభూషణరావు, ఏయూ వీసీ



ప్రస్తుతం భిన్నమైన బాషల్లో నైపుణ్యం కలిగిన వారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లబిస్తు న్నాయి. కొన్ని భాషలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని డిప్లమో కోర్సులు నిర్వహిస్తున్నాం. ఈ కోర్సుల్లో చేరడం వల్ల విద్యార్థుల్లో అంతర్జాతీయ దృక్పథం కలుగడంతో పాటు బహుళజాతి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. ఈ భాషలతో విద్యార్థులకు ఆయా ఆయా దేశాల సంస్కృతి, ఆచార వ్యవహారాలను తెలుసుకునే అవకాశం కలుగుతుంది. వర్సిటీలో నిర్వహిస్తున్న కోర్సులకు మంచి ఆదరణ లబిస్తోంది. డిమాండ్ ఉన్న మరిన్ని బాషలను రానున్న రోజుల్లో కోర్సులు కింద తీసుకువస్తాం.

కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మోక్షం!

రెండేళ్ల కిందట నోటిఫికేషన్ విడుదల

- గత ఏడాది ఫిబ్రవరిలో ప్రిలిమ్స్
- మార్చిలో శారీరక, దేహదారుఢ్య పరీక్షలకు షెడ్యూల్
- ఎమ్మెల్సీ ఎన్నికల నెపంతో తప్పించుకున్న వైసీపీ సర్కారు
- తదుపరి ప్రక్రియకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి విశాఖలో పదివేల మందికి ఊరట



విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :

రెండేళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయిన కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియకు కదలిక వచ్చింది. వైసీపీ హయాం లో ఖాళీలను భర్తీ చేసేందుకు 2022 నవంబరులో నోటిఫికేష న్ విడుదల చేశారు. గత ఏడాది జనవరిలో ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించారు. మార్చిలో శారీరక, దేహదారుఢ్య పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేశారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నిక లు, కోర్టు కేసులను బూచిగా చూపించిన వైసీపీ ప్రభుత్వం తదుపరి ప్రక్రియను పక్కన పెట్టేసింది. ఈ సమస్యను గుర్తించిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రక్రియను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజాగా ప్రకటన విడుదలైంది.

రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్‌శాఖలో ఖాళీగా ఉన్న 6,100 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో 4,59,182 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలో 95,208 మంది అర్హత సాధించారు. అప్పటి నుంచి వీరంతా ఫిజికల్ టెస్ట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రిలిమ్స్ అర్హత సాధించిన సుమా రు పది వేల మందికిపైగా అభ్యర్థులున్నారు.

హామీని నిలబెట్టుకున్న చంద్రబాబు

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశ గా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు డిసెం బరు చివరి వారంలో ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి శారీరక, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడిం చింది. నిరీక్షణకు తెరదించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని అభ్యర్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా గ్రౌండ్ ప్రాక్టీస్ చేస్తూనే ఉన్నా మని, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రామకృష్ణ అనే అభ్యర్థి వాపోయాడు. ఎట్టకేలకు కల నెరవేరే సమయం దగ్గరపడిందని ఆనందం వ్యక్తం చేశాడు. కాగా ఫిజికల్ టెస్ట్‌లో క్వాలిఫై అయిన వారికి మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి ఉద్యోగాలు దక్కనున్నాయి. తాజా నోటిఫికేషన్‌లో భాగంగా విశాఖ సిటీ పరిధిలో 187, గ్రామీణ జిల్లా పరిధిలో 159 సివిల్ కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

నిరీక్షణకు తెరపడింది



రెండేళ్లుగా పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్నాం. గత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ప్రక్రియను పూర్తి చేయలేక పోయింది. దీంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతిరోజూ గ్రౌండ్ ప్రాక్టీస్ చేయాల్సి వస్తోంది. ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం తదుపరి ప్రక్రియకు చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉంది. వీలైనంత వేగంగా మిగిలిన ప్రక్రియను పూర్తి చేస్తే వేలాది మందికి మేలు చేసినట్టు అవుతుంది.

- వి.గౌరినాయుడు, అభ్యర్థి

బైక్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

ఎండాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బైక్ ఢీకొనడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పీఎంపాలెంలోని ధర్మపురి కాలనీలో నివాసం ఉంటున్న చల్లా అజయ్ దిలీప్ (26) శనివారం రాత్రి 10 గంటల సమయంలో పీఎంపాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో ఉన్న జాతీయ రహదారి దాటుతుండగా మధురవాడ నుంచి ఎండాడ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కంచి శివ (23) ఢీకొన్నాడు. దీంతో దిలీప్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతన్ని గీతం ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు వెంకోజీపాలెంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అజయ్ దిలీప్ ఇన్ఫోసిస్‌లో వర్క్ ఫ్రం హోమ్ నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. అజయ్ దిలీప్ సోదరి సాయి పావని కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి జారిపడి యువతి మృతి

ఎండాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాదిలోని శివశక్తినగర్‌లో ఉన్న ఎస్వీఎస్ పయనీర్ క్యాజల్ అపార్ట్‌మెంట్ నాల్గవ అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడి యువతి మృతి చెందింది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎస్వీఎస్ పయనీర్ కాజిల్ అపార్ట్‌మెంట్ నాల్గవ అంతస్తులో నివాసం ఉంటున్న జరాజన గాయత్రి (23) ఆదివారం ఉదయం ఇంటి వరండాను తడి గుడ్డతో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందకు జారి పడింది. దీంతో తలకు బలమైన గాయం కావ డంతో అక్కడికక్కడే మృతి చెందింది. గాయత్రి బుల్లయ్య కళాశాలలో బీబీఏ ఫైనల్ ఇయర్ చదువుతుంది. తండ్రి భద్రాచలం మర్చంట్ నేవీలో విధులు నిర్వహిస్తుండగా, సోదరుడు ఉన్నాడు. మృతురాలి తల్లి ఉషారాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల విజేత విశాఖ

నక్కపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14 బాల, బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నక్కపల్లిలో మూడు రోజుల పాటు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో బాలికల విభాగంలో కడప జట్టు, బాలుర విభాగంలో విశాఖ జట్టు విజేతగా నిలిచాయి. వీరు వచ్చే నెల 8 నుంచి 13 వరకు మధ్యప్రదేశ్‌లోని మాంటిస్సోరిలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనున్నారు.

ఇద్దరు సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టు?

మహారాణిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన ఇద్దరిని మహారాణిపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మధురవాడకు చెందిన ఇంటూరి రవికుమార్‌ను అదుపులోకి తీసుకుని, మహారాణిపేట స్టేషన్‌కు తీసుకువచ్చి,స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం పీటీ వారెంట్ జారీచేసి, రాజమహేంద్రవరంలోని ప్రకాశ్‌నగర్ స్టేషన్‌కు తరలించారని తెలిసింది. కాగా అభ్యంతకర పోస్టులు పెట్టారంటూ జీవీఎంసీ 29వ వార్డుకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు బోడి వెంకటేశ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, పీటీ వారెంట్‌పై మరో స్టేషన్‌కు తరలించినట్టు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీచ్ రోడ్డులో ఉల్లాసంగా మారథాన్



బహుమతులు అందజేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులో ఇండియన్ నేవీ సహకారంతో నమహ అకాడమీ ఆదివారం నిర్వహించిన మారథాన్ ఉల్లాసంగా జరిగింది. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాలు వద్ద నుంచి వుడా పార్కు వరకు 3.కి.మీ, 5 కి.మీ మేర జరిగిన మారథాన్ రన్‌లో సుమారు 800 మంది పాల్గొని ఉత్సాహంగా పరుగు తీశారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్ ప్రారంభించారు. అనంతరం మారథాన్‌లో విజేతలుగా నిలిచిన వారికి పతకాలు, ధ్రువ పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఆత్మరక్షణ, శరీర పటుత్వం ప్రాధాన్యతను తెలుపుతూ నిర్వహించిన మారథాన్ రన్‌లో అన్ని వయసుల పురుషులు, మహిళలు చురుగ్గా పాల్గొనడం విశేషమన్నారు. నేవీ సిబ్బందితో పాటు విద్యా సంస్థలు, ఎన్జీవో సంస్థల నుంచి అత్యధికంగా పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. రోజువారీ జీవితంలో ఫిట్‌నెస్‌ను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలని,అలాగే వయో భేదం లేకుండా మహిళలు ఆత్మరక్షణ యుద్ధ కళలు నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జీవితంలో శాశ్వత ప్రభావాన్ని చూపే ఫిట్‌నెస్‌కు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కెప్టెన్ టీఆర్ఎస్ కుమార్, నమహ అకాడమీ ప్రతినిధులు స్వాతి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో భారీ చోరీ

- 18 తులాల బంగారం, నగదు అపహరణ

మల్కాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఎంబజీ క్వార్టర్స్‌లో భారీ చోరీ జరిగింది. ఇక్కడి క్వార్టర్స్‌లోని ఓ ఇంట్లో నేవీ రిటైర్డు అధికారి ప్రసాద్ సింగ్ అద్దెకు ఉంటున్నారు. గత ఆదివారం ఆయన కుటుంబంతో సహా ఊరెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి పరిశీలించగా సామాన్లన్నీ చిందరవందరగా పడివుండడంతో ఆందోళనకు గురయ్యారు. మంచం కింద సూట్‌కేసులో ఉంచిన 18 తులాల బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ ఎంవీ రమణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1,800 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

పెందుర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని నరవలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 1,800 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసేందుకు నిల్వ చేశారన్న సమాచారం మేరకు ఆదివారం పెందుర్తి పోలీసులు దాడులు చేసి సబ్బవరానికి చెందిన కూన గోవిందరావు ఇక్కడ ఈ బియ్యాన్ని ఉంచినట్టు గుర్తించి సీజ్ చేశామని సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు.గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని దళారీల ద్వారా కొనుగోలు చేసి స్టాక్ పాయింట్లో నిల్వ చేస్తుంటారన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎంఎల్‌సీ పాయింట్‌కి తరలించి, గోవిందరావుపై కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

ముగిసిన ఎండోక్రైనాలజీ వైద్యుల సదస్సు



సదస్సుకు హాజరైన వైద్యులు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నోవా టెల్‌లో జరుగుతన్న ఇసికాన్ సదస్సు ఆదివారంతో ముగిసింది. నాలుగు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో 2600 మంది వైద్యులు పాల్గొనగా, 150 అంశాలపై చర్చించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన ఎంతోమంది వైద్యులు ఆయా దేశాల్లో కొత్తగా నమోదవుతున్న కేసులు, నూతన వైద్య పద్ధతులు గురించి వివరించారు. పలు పరిశోధనా పత్రాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. సదస్సులో అమెరికా, యూకే, యూఏఈ వంటి దేశాలు నుంచి వచ్చిన ప్రముఖ వైద్యులు డయాబెటిస్, థైరాయిడ్, నపుంస కత్వం, అమ్మాయిల్లో వచ్చే అవాంఛిత రోమాలు, పొడవు, పొట్టిగా ఉండడం, స్థూలకాయం వంటి సమ స్యలు, ఆయా సమస్యలతో బాధపడేవారికి అందిస్తున్న నూతన వైద్య పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కేఏవీ సుబ్రహ్మణ్యం, వైద్యులు కె. దిలీప్ కుమార్, శ్రీధర్, మైథిలి, వివేకానంద, వంశీకృష్ణ, రామ్మోహన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ కోసం పోస్టు కార్డు ఉద్యమం



పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న రమణమూర్తి

రామ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం నిర్వహించారు. ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద ప్రజా సంస్థ సంఘాల ఉత్తరాంధ్ర కన్వీనర్ వీవీ రమణమూర్తి పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. సంఘాల నేతలు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయ వద్దంటూ ప్రధాని నరేంద్ర మోడీని కోరుతూ పది లక్షల పోస్టు కార్డులను పంపిస్తామని తెలిపారు. ప్రైవేటీకరణ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవటానికే ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఇప్పటికే రెండు లక్షల కార్డులను పంపించామని, త్వరలోనే మరిన్ని కార్డులు పంపిస్తామని తెలిపారు. ఇది ప్రపంచ చరిత్రలోనే ఒక రికార్డు అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రజా సంస్థ ప్రతినిధులు కె.వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, లలితా, వై.నూకరాజు, సునీత నాంప్రభు, డాక్టర్ వసంత రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ

గోపాలపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు..మున్నాన ఈశ్వరరావు (ఏసుబాబు) ఆటో డ్రైవర్. భార్య వాగ్దేవి, చెల్లెలు భాగ్యలక్ష్మి (19)తో కలిసి 89వ వార్డు కొత్తపాలెంలోని నాగేంద్ర కాలనీలో ఉంటున్నాడు. తల్లిదండ్రులు మృతి చెందడంతో భాగ్యలక్ష్మి అన్నా వదిన వద్దే ఉంటూ నర్సింగ్ చదువుతుంది. ఈనెల 6న ఈశ్వరరావు బేరంపై వెళ్లడంతో రాత్రికి ఇంటికి రాలేదు. వాగ్దేవి పెట్రోల్ బంక్‌లో పని ముగిశాక ఇంటికి రాకుండా సమీపంలో ఉంటున్న పుట్టింటికి వెళ్లింది. మరుసటి రోజు ఆరు గంటల సమయంలో వాగ్దేవి ఇంటికి రాగా భాగ్యలక్ష్మి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉంది. ఈ విషయమై ఈశ్వరరావు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఆటోలో మృతదేహాన్ని కొత్తపాలెం శ్మశానవాటికకు తీసుకువెళ్లి దహన సంస్కారాలు నిర్వహించాడు. బంధువులు వచ్చేసరికే అంత్యక్రియలు చేయడంతో వారు ఈశ్వరరావును నిలదీశారు. భాగ్యలక్ష్మి అన్నా వదినల వేధింపులు తాళలేకే ఆత్మహత్యకు పాల్పడిందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏసీపీ అన్నెపు నరసింహ మూర్తి ఆదివారం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి అన్నా వదినలతో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు.

బతికున్న బిడ్డ మృతి చెందినట్టు కేజీహెచ్ వైద్యుల ప్రకటన

మహారాణిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్ వైద్యులు బతికున్న శిశువును చనిపోయినట్టు నిర్ధారించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరానికి చెందిన ఓ గర్భిణి అనారోగ్య సమస్యలతో 25 వారాలకే ప్రసవం కోసం ఈనెల 9న కేజీహెచ్‌లోని గైనిక్ వార్డులో చేరింది. అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో వైద్యులు ఆమెకు అత్యవసరంగా సిజేరియన్ చేసి బిడ్డను తీశారు. ప్రీమెచ్యూర్ బేబీ కావడంతో అతి తక్కువ బరువు, హార్ట్ బీట్ సరిగ్గా లేకపోవడాన్ని గుర్తించారు. శిశువు బతికే అవకాశం లేదని భావించిన వారు వైద్యులు తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో శిశువు మృతి చెందినట్టు ప్రకటించారు. ఈ వివరాలను ఆస్పత్రి రికార్డుల్లోనూ నమోదు చేశారు. బంధువులు శిశువును ఇంటికి తరలిస్తుండగా కదలిక గమనించారు. తిరిగి ఆస్పత్రిలోకి తీసుకువెళ్లి,బిడ్డ బతికే ఉందనివైద్యులకు తెలియజేయడంతో వారు విస్తుపోయారు. పరీక్షలు నిర్వహించి, ఐసీయూకు తరలించారు. ఈవిషయమై బిడ్డ తండ్రి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌కు ఫిర్యాదు చేశాడు. ఆయన ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు.